మంగళవారం
31-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 130
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హైకోర్టు జడ్జిగా గుహనాథన్ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గుహనాథన్ నరేందర్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉండి సహకార బ్యాంకులో రూ.2 కోట్లకు పైగా కుంభకోణం

- ఉద్యోగుల చేతివాటం
- రూ.62 లక్షలు స్వాహా అయినట్లు గుర్తించిన అధికారులు
- బాధితుని ఫిర్యాదుతో బయటపడ్డ వైనం

విశాలాంధ్ర-ఉండి: ఉండి సహకార బ్యాంకులో రూ.2 కోట్లకు పైగా కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడి కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు భగ్గుమన్నాయి. ఉద్యోగులు చేతి వాటం ప్రదర్శించి రూ.62 లక్షలు స్వాహా చేసినట్లు ప్రాథమిక విచారణలో బయటపడింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ అధికారి జి.సత్యనారాయణ బ్యాంకులో రికార్డులు పరిశీలించి రూ.62 లక్షల మేర అవకతవకలు జరిగాయని గుర్తించినట్లు తెలిపారు. ఈ సహకార పరపతి సంఘంలో 7,161 మంది సభ్యులు ఉన్నారు. ఇంకా లోతైన దర్యాప్తు చేసిన తరువాత మాత్రమే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. విచారణ అధికారులు సభ్యులందరికీ నోటీసులు జారీ చేసి బ్యాంకు మంజూరు చేసిన రుణాలపై విచారణ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

విస్తుపోయేలా గోల్‌మాల్?

ఉండి విశాల సహకార పరపతి సంఘంలో ప్రజలు విస్తుపోయే విషయాలు బహిర్గతమయ్యాయి. బంగారం రుణాలకు సంబంధించిన సంచులు మాయం అయ్యాయి. బ్యాంకు రుణాలు తీసుకున్న సభ్యులు తమ రుణాన్ని చెల్లించి బంగారాన్ని విడుదల చేయించుకొని వస్తువులు తీసుకువెళ్లారు. అయితే సభ్యుల పేరున రుణాలు ఇంకా కొనసాగడం అంతుపట్టని విషయం. ప్రాథమిక విచారణలో ఈ విషయాన్ని గుర్తించారు. సీకేసీసీ రుణాలకు సంబంధించి ఇందులో సభ్యుల నుంచి

- మిగతా 2 లో

ఉల్లి @ 80

- నిరంతరాయంగా పెరుగుతున్న ధరలు
- గృహిణులకు కన్నీళ్లు తెప్పిస్తున్న వైనం
- మరింత పెరుగుతాయంటున్న వ్యాపారులు
- సబ్సిడీపై అదనపు నిల్వల విక్రయానికి కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ/జైపూర్/బెంగళూరు: ఉల్లి ధరలు పెరగడంతో గృహిణులకు మళ్లీ కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. దేశవ్యాప్తంగా అక్టోబరు 10 నుంచి నిరంతరాయంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఉల్లి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించినప్పటికీ దాని పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. దేశవ్యాప్తంగా ఆదివారం సగటున కేజీ ఉల్లిపాయల ధర రూ.48 పలికింది. అత్యధికంగా రూ.83 ఉన్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో రిటైల్ ధర రూ.80గా ఉంది. అంతకుముందు రేట్లతో పోల్చితే దాదాపు రెట్టింపవ్వడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం జైపూర్‌లోని రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.60 నుంచి రూ.75 వరకు విక్రయించారు. బెంగళూరులో వారం రోజులుగా ఉల్లి ధరలు రెట్టింపు అయ్యాయి. ఇటీవలి టమాటా ధరలు పెరిగినట్లే... బెంగళూరులో హోల్‌సేల్, రిటైల్ ధరలు కూడా భారీగా పెరిగాయి. ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని జైపూర్‌లోని ముహనా మండి వ్యాపారులు తెలిపారు. పెరిగిన డిమాండ్, కొరత కారణంగా, తాజా నిల్వ రావడం ప్రారంభమయ్యే వరకు... నవంబరు రెండవ వారం వరకు ధరలు అధిక స్థాయిలో ఉండే అవకాశం ఉంది. పక్షం రోజులుగా ధరలు నిరంతరంగా పెరగడానికి గల కారణాలపై ఉల్లిపాయల రిటైలర్లు, హోల్‌సేల్ డీలర్లతో మాట్లాడగా, 'స్థానికంగా పండించిన ఉల్లిపాయల నిల్వ అయిపోయింది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి మాకు సరఫరా జరుగుతోంది. దీంతో హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.75 వరకు విక్రయిస్తున్నారు' అని ముహనా మండి హోల్‌సేల్ వ్యాపారి శివశంకర్ శర్మ తెలిపారు. 'వచ్చే వారంలో ఇది కిలోకు రూ. 100కు చేరవచ్చు. అయితే, నవంబరు 15 నుంచి మేము స్థానికంగా పండించిన ఉల్లిని మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా రావడం ప్రారంభించినందున ధరలు తగ్గడం ప్రారంభమవుతుంది' అని ముహనా మండి వద్ద ఉల్లి, వెల్లుల్లి హోల్‌సేల్ వ్యాపారి అబ్దుల్ హమీద్ అన్నారు. ఒక అంచనా ప్రకారం, ముహనా మండి వద్ద వ్యాపారులకు దాదాపు లక్ష కిలోల ఉల్లిపాయలు అందుతున్నాయి. 'సాధారణ రోజుల్లో మనకు సాధారణంగా 1.5 లక్షల కిలోగ్రాముల ఉల్లి అవసరం. పెళ్లిళ్ల సీజన్‌లో మనకు దాదాపు 2.5 లక్షల కిలోగ్రాముల ఉల్లిపాయలు అవసరం. మేము

- మిగతా 2 లో

రైలు ప్రమాదంలో కూలీలే సమిధలు

- 13కి చేరిన మృతులు: 54 మందికి గాయాలు
- యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లా కంటకాపల్లి రైలు ప్రమాద ఘటనా స్థలంలో యుద్ధప్రాతిపదికన రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. రైళ్ల రాకపోకలకు అనుగుణంగా పట్టాలను పునరుద్ధరించారు. పట్టాలపై గూడ్స్ రైలుతో ట్రయల్ రన్ నిర్వహించారు. విశాఖ-విజయనగరం డౌన్‌లైన్ ట్రాక్ వైపు గూడ్స్‌ను అధికారులు నడిపారు. గూడ్స్ వెళ్లిన తర్వాత అదే పట్టాలపై ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో 13 మంది మరణించారు. 54మంది గాయపడ్డారు. ప్రమాదంలో కూలీలే సమిధులుగా మారారు. వాస్తవానికి ఈ రెండు ప్యాసింజర్ రైళ్లలో కూలీలు అధికంగా ప్రయాణిస్తారు. అతి తక్కువ చార్జీలతో ప్రయాణించి పట్టణ ప్రాంతాలలో పనులు చేసుకుని తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. ఇటువంటి కూలీ పనులకు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి రోజూ వందల మంది ఈ రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. రైలు ప్రమాద బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి హామీ ఇచ్చారు. వారిని అన్ని విధాలా

- మిగతా 2 లో

ఎంఎస్ఎంఈలకు పునరుజ్జీవం

- రూ.19,037 కోట్ల పెట్టుబడులు... 69,565 ఉద్యోగాలు
- పరిశ్రమల ప్రతిపాదనలకు, ప్రోత్సాహకాలకు ఎస్ఐపీబీ ఆమోదం
- పారిశ్రామిక విధానాల్లో మార్పులు, చేర్పులు అవశ్యమన్న సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎంఎస్ఎంఈల రంగానికి ఇన్సెంటివ్‌లు ఇస్తూ పునరుజ్జీవం ఇచ్చామని, ఎక్కువమందికి జీవనాధారం కల్పిస్తున్న ఈ చిన్న పరిశ్రమలను కాపాడుకోవడం మన బాధ్యతని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ అధ్యక్షతన సమావేశమైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) వివిధ పరిశ్రమల ప్రతిపాదనలకు, ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపింది. మొత్తంగా ఈ సమావేశం రూ.19,037 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలియజేయగా, తద్వారా 69,565 మందికి ఉద్యోగావకాశాలు రానున్నట్లు అంచనా వేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికరంగంలో

- మిగతా 2 లో

ఎన్‌సీపీ ఎమ్మెల్యే ఇంటికి నిప్పు

మరాఠా రిజర్వేషన్ల ఆందోళన హింసాత్మకం

ముంబై: మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని మజల్‌గావ్ ప్రాంతంలో ఎన్‌సీపీ ఎమ్మెల్యే ప్రకాష్ సోలంకే నివాసానికి కొంతమంది ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో మరాఠా రిజర్వేషన్లపై కొనసాగుతున్న నిరసన సోమవారం హింసాత్మకంగా మారింది. రెండో విడత నిరసనలో భాగంగా జల్నా జిల్లాలోని అంతర్వాలి సరతి గ్రామంలో మరాఠా కోటా కార్యకర్త మనోజ్ జరంగే అక్టోబరు 25 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేయడంతో మరాఠా ఆందోళన మరోసారి తీవ్రమైంది. 'దాడి జరిగినప్పుడు నేను మా ఇంటి లోపల ఉన్నాను. అదృష్టవశాత్తూ, నా కుటుంబ సభ్యులు లేదా సిబ్బంది ఎవరూ గాయపడలేదు. మేమంతా సురక్షితంగా ఉన్నాము. కానీ అగ్నిప్రమాదం కారణంగా భారీ ఆస్తి నష్టం జరిగింది' అని బీడ్‌లోని సోలంకేని ఉటంకిస్తూ ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించింది. ఆందోళనకారులు ఇంటి ఆవరణలో పార్క్ చేసిన వాహనాలను కూడా తగులబెట్టారు. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్పందిస్తూ, 'ఈ నిరసన ఏ మలుపు తిరుగుతుందో మనోజ్ జరంగే పాటిల్ (మరాఠా రిజర్వేషన్ ఉద్యమకారుడు) గమనించాలి. ఇది తప్పు దిశలో వెళుతోంది' అని

- మిగతా 2 లో

చంద్రబాబుపై సీఐడీ మరో కేసు

- మద్యం కంపెనీలకు అక్రమంగా అనుమతులిచ్చారని అభియోగం
- ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు, విచారణకు అనుమతి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి రాష్ట్ర ప్రభుత్వం వరుస షాక్‌లు ఇస్తోంది. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 50 రోజులకు పైగా రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనపై ఫైబర్ గ్రిడ్, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ కుంభకోణమంటూ మరో రెండు కేసులు నమోదు చేసిన విషయం తెల్సిందే. ఇవి చాలవన్నట్లు ఏపీ సీఐడీ అధికారులు చంద్రబాబుపై తాజాగా మరో కేసు నమోదు చేశారు. మద్యం కంపెనీ లకు అక్రమంగా అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలతో చంద్రబాబుపై కేసు నమోదు చేశారు. పీసీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చంద్రబాబును ఎ-3గా సీఐడీ ఆ కేసులో చేర్చింది. విజయవాడ ఏసీబీ కోర్టులో ఈ మేరకు సోమవారం పిటిషన్ దాఖలు చేయగా, దానిని ఏసీబీ కోర్టు విచారణకు అనుమతించింది. చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్యలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏకంగా ఏడు డిస్టిలరీలకు అనుమతి ఇచ్చారని, సుమారు 254 బ్రాండ్లకు అనుమతినిచ్చి లిక్కర్ విక్రయాలను ప్రోత్సహించారని ఆయనపై అభియోగం మోపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 20 డిస్టిలరీలకు గాను ఏకంగా 14 డిస్టిలరీలకు అక్రమంగా అనుమతి ఇచ్చినందున అవినీతి నిరోధక చట్టం కింద బాబుపై సీఐడీ కేసు నమోదు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మధ్యంతర బెయిల్‌పై హైకోర్టు మంగళవారం తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో చంద్రబాబు బయటకు రాకుండా చేసేందుకు మరో అక్రమ కేసు నమోదు చేశారని టీడీపీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

జగన్ పైశాచిక ఆనందం పురాకాష్టకు చేరింది: అచ్చెన్నాయుడు ఆగ్రహం

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో అక్రమాలు జరిగితే నాలుగున్నరేళ్ల పాటు ఎందుకు జగన్ మౌనంగా ఉన్నారు? ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇప్పుడే కనిపించిందా? చంద్రబాబు నాయుడికి మంగళవారం మధ్యంతర బెయిల్ పై తీర్పు వచ్చే ముందు రోజే అవినీతి కనపడిందా? ఇది పక్కా రాజకీయ కుట్ర. ఇది జగన్ దృష్టి మళ్లింపు జిత్తుల్లో భాగమేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో లక్ష కోట్ల మద్యం కుంభకోణం జరిగింది, నాసిరకం మద్యం పోసి ప్రజల ప్రాణాలు తీస్తున్నారు కనుక దీనిపై విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ రాష్ట్ర నాయకులు ఫిర్యాదులు చేశారు.

ఇదీ లోకం!

మమ్మల్ని అన్యాయం చేయడం కాకపోతే మీరిప్పుడు రైలు ప్రయాణం చేయడం అవసరమా?

గాజా నడిబొడ్డున ఇజ్రాయిల్ దళాలు

- భూతల దాడులు ఉధృతం
- 24గంటల్లో 600 స్థావరాలపై దాడి
- 20 మంది హమాస్ మిలిటెంట్ల మృతి
- ఇజ్రాయిల్ రక్షక దళం వెల్లడి

ఖాన్‌యూనిస్: పలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్‌తో ఇజ్రాయిల్ భీకర యుద్ధం సోమవారం 24వ రోజుకు చేరుకుంది. హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా ఇజ్రాయిల్ సైన్యం గాజాపై భూతల, వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఇజ్రాయిల్ బలగాలు వందల సంఖ్యలో హమాస్ స్థావరాలపై దాడులు జరిపాయి. దాడుల్లో 20 మందికిపైగా మిలిటెంట్లను మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ రక్షక దళం (ఐడీఎఫ్) పేర్కొంది. ఇదే సమయంలో ఉత్తర గాజా నుంచి దక్షిణం వైపు ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులు కదులుతున్నట్లు సమాచారం. 'గడిచిన 24 గంటల్లో 600 స్థావరాలపై దాడులు చేశాం. అంతకుముందు రోజు 450 లక్ష్యాలను మట్టుబెట్టాం. డజన్లకొద్దీ క్షిపణి ప్రయోగ స్థావరాలు, ఆయుధ డిపోలే లక్ష్యంగా దాడులు జరిపాం. ఉత్తర గాజాలో హమాస్‌తో భారీ పోరు కొనసాగుతోంది' అని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి వెల్లడించారు. మరోవైపు, ఇజ్రాయిల్ జరుపుతోన్న ప్రతిదాడుల్లో 8306 మంది పలస్తీనియన్ల ప్రాణాలు

- మిగతా 2 లో

మోదీ పాలనలో ఉద్యోగ నష్ట వృద్ధి

- రాజ్యాంగాన్ని సవాల్ చేసే చర్యలను తిప్పికొట్టాలి
- ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి తిరుమలై

2 లో

కొత్త ప్రభాకరరెడ్డిపై హత్యాయత్నం

- ఎన్నికల ప్రచారం చేస్తుండగా కత్తితో దాడి
- సిద్దిపేట జిల్లా సూరంపల్లిలో ఘటన

విశాలాంధ్ర-హైదరాబాద్: మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తితో దాడి యత్నం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. సోమవారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్

- మిగతా 2 లో

టర్కీలో కమ్యూనిస్ట్, వర్కర్స్ పార్టీల 23వ అంతర్జాతీయ సమావేశం

టర్కీ: సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకించడం, అణ్వాయుధాలు, విదేశీ సైనిక స్థావరాలతో సహా ఆయుధ పోటీలు, పద్ధతులను తిరస్కరించడం, ఉక్రెయిన్‌లో యుద్ధం, పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దురాక్రమణను ప్రపంచ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇజ్మీర్‌లో అక్టోబరు 20 నుంచి 23 వరకు జరిగిన 23వ ఐఎమ్‌సీడబ్ల్యుపీ సమావేశంలో వివిధ దేశాలనుండి ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. నాటో దాని మిత్రదేశాల ప్రమేయానికి వ్యతిరేకంగా, ప్రపంచవ్యాప్తంగా నాటో విస్తరణ, దురాక్రమణకు వ్యతిరేకంగా వర్గ-ఆధారిత ప్రచారాన్ని, సమీకరణను పెంచాలని సంకల్పించాయి. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రపంచ శాంతి మండలి ప్రయత్నాలకు మద్దతుగా "ప్రపంచ శాంతి దినోత్సవం" చేపట్టాలని పిలుపునిచ్చాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం లక్ష్యాలలో ప్రధానంగా ఫాసిజానికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాటం చేయాలని సంబంధిత వర్గాలు సంకల్పించాయి. 1945లో ఫాసిజంపై విక్టరీ దినోత్సవాన్ని 2024 సంవత్సరంలో పెద్దఎత్తున చేయాలని సభ్య దేశాలు నిర్ణయించాయి. 2024 సంవత్సరంలో నిర్వహించనున్న మే డే దినోత్సవాన్ని కార్మికుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వంకోసం వర్గ పోరాటాల దినంగా నిర్వహించనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పెట్టుబడిదారీ దోపిడీ నిర్మూలన కోసం, కార్మికుల పోరాటాలు, ట్రేడ్ యూనియన్ హక్కులను నేరపూరితం చేయడాన్ని వ్యతిరేకిస్తూ అన్నిరకాల అణచివేతలు, జోక్యం, నిషేధాలను ఎదుర్కొంటున్న కమ్యూనిస్టుల స్వేచ్ఛను హరించడాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. సోషలిజం విలువలను పెంపొందించడానికి ఉమ్మడి ప్రకటనలు, ప్రచారాలతో కమ్యూనిస్టుల పోరాటానికి గుర్తుగా అంతర్జాతీయ దినోత్సవాలను గౌరవించడం. ఈ నేపథ్యంలో లెనిన్ వర్ధంతి సందర్భంగా సోషలిస్టు సిద్ధాంతాలు, విలువలు, సోషలిజం చారిత్రక ఔచిత్యాన్ని ప్రచారం చేసేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నెల్సన్ మండేలా వర్ధంతి పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ఈ సమావేశం నిర్ణయించింది. కమ్యూనిజం వ్యతిరేక, ఫాసిజం, సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ యూనియన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న కల్పిత ప్రచారానికి వ్యతిరేకంగా ఉమ్మడి కార్యకలాపాలను చేపట్టాలను నిర్ణయించింది. అసమానత, అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా మహిళల పోరాటాన్ని బలోపేతం చేయడం ద్వారా మార్చి 8, అంతర్జాతీయ మహిళా దినోత్సవంతోపాటు ముఖ్యంగా శ్రామిక మహిళల్లో చైతన్యాన్ని పెంచాలని అంతర్జాతీయ కమ్యూనిస్టు సమావేశం నిర్ణయించింది.

క్యూబాను "ఉగ్రవాదానికి స్పాన్సర్‌ల" జాబితాలో ఏకపక్షంగా చేర్చడం, క్యూబా అంతర్గత వ్యవహారాల్లో జోక్యానికి వ్యతిరేకంగా వ్యవహరించడం, అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక దిగ్బంధనాన్ని తక్షణం బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్‌చేసింది. ఈ నేపథ్యంలో క్యూబా ప్రజలకు సంఘీభావం తెలిపింది. ప్రతి నెలా చివరి వారాంతంలో నిర్వహించే క్యూబాతో అంతర్జాతీయ సాలిడారిటీ డేస్‌లో మరింత చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించింది. 2024 సంవత్సరం మే 4, 5 తేదీలలో క్యూబాలోని గ్వాంటనామోలో జరిగే విదేశీ సైనిక స్థావరాలను రద్దు చేయడం కోసం అంతర్జాతీయ సెమినార్‌లో పాల్గొనవలసిందిగా ఈ సమావేశం పిలుపునిచ్చింది. క్యూబాతో సంఘీభావ సదస్సును అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనడాన్ని ప్రోత్సహించడానికి సైద్ధాంతిక ప్రచురణల ద్వారా పిలుపునిచ్చాయి.

పలస్తీనా ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ దాడులను ముగించాలని, పలస్తీనా ఆక్రమణను అంతం చేయాలని, పలస్తీనా ప్రజల స్వీయ-నిర్ణయాధికారం, ప్రతిఘటన ద్వారా పలస్తీనా స్వతంత్ర సార్వభౌమ హక్కును డిమాండ్ చేసింది. శరణార్థులు తిరిగి వచ్చే హక్కును డిమాండ్ చేసింది. పలస్తీనా రాజకీయ ఖైదీల విడుదలకు అనుగుణంగా భద్రత కల్పించడం. ఆక్రమిత పలస్తీనా భూభాగాలపై ఇజ్రాయెల్ వలసవాద, వివక్షత విధానాలను ఖండించింది.. ఈ నేపథ్యంలో పాలస్తీనా ప్రజలకు నవంబర్ 29న అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవాన్ని ప్రకటించింది.

ఏథెన్స్‌లో పలస్తీనాకు మద్దతుగా భారీ ప్రదర్శన

ఏథెన్స్: పలస్తీనాకు మద్దతుగా గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎమ్‌ఈ) పిలుపు మేరకు భారీ ప్రదర్శన జరిగింది. వేలాది మంది ప్రదర్శనకారులు గ్రీస్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట అదే కూడలిలో ఉన్న ఇజ్రాయిల్ రాయబార కార్యాలయం ఎదుట ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ర్యాలీని ఉద్దేశించి ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, గాజా స్ట్రిప్‌లో పాలస్తీనా ప్రజల ఊచకోతలను, ఇజ్రాయిల్ ఆక్రమణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తూర్పు జెరూసలేం రాజధానిగా 1967లో జరిగిన నిర్ణయం మేరకు పలస్తీనా ప్రజలు స్వంత మాతృభూమిని కలిగి ఉండాలనే హక్కును, పలస్తీనాపై జరుగుతున్న దురాగతాలకు నాటో, ఈయూ ఉమ్మడి బాధ్యత వహించాలని, డిమాండ్ చేశారు. గ్రీస్‌లోని వివిధ నగరాల్లో ఇలాంటి ప్రదర్శనలు జరిగాయి. ఈ సమావేశాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పలస్తీనాకు సంఘీభావం ప్రకటించారు.

ఎన్‌సీపీ ఎమ్మెల్యే ఇంటికి నిప్పు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. శాంతిభద్రతలను కాపాడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాల జోలికి పోవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కాగా, మంగళవారం జరిగే కేబినెట్ సమావేశంలో మరాఠా రిజర్వేషన్ కల్పించేందుకు జస్టిస్ షిండే కమిటీ నివేదికను అధికారికంగా అంగీకరిస్తామని, కుంబీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేస్తామని షిండే తెలిపారు. మరో పరిణామంలో, సీఎం షిండే నీరు తాగాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేసినప్పటికీ, జరాంగే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడానికి నిరాకరించారు. చట్టపరమైన పరిశీలనలో ఉన్న మరాఠా సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని మహారాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

రెండు దశల్లో మరాఠా రిజర్వేషన్లు: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే

రెండు దశల్లో మరాఠా రిజర్వేషన్లు కల్పిస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. సోమవారం జరిగిన మరాఠా రిజర్వేషన్ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అంశాన్ని పరిశీలించేందుకు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ భోస్లే, జస్టిస్ గైక్వాడ్, జస్టిస్ షిండే నేతృత్వంలో ప్రభుత్వం అడ్వయిజరీ బోర్డును ఏర్పాటు చేసిందని చెప్పారు. 'మరాఠాల రిజర్వేషన్‌కు సంబంధించి ఏం చేయాలనే విషయంలో ఈ అంశాన్ని సుప్రీం కోర్టులో ఉంచే విషయంలో ఈ అడ్వైజరీ బోర్డు ప్రభుత్వానికి సూచనలు చేస్తుంది. దీంతో పాటు మొత్తం రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల కమిషన్ సహాయంతో అనుభావిక సమాచారాన్ని సేకరిస్తాం. తద్వారా పెండింగ్‌లో ఉన్న క్యూరేటివ్ పిటిషన్‌లో మరాఠా సమాజం ఎంత వెనుకబడి ఉందో మనం సుప్రీం కోర్టుకు చెప్పగలము' అని అన్నారు. ఈ కీలక సమావేశంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, బీజేపీ మంత్రులు చంద్రకాంత్ దాదా పాటిల్, రాధాకృష్ణ విఖే పాటిల్, మంత్రి శంభురాజ్ దేశాయ్, శివసేన ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన దాదా భూసే, నేషనలిస్ట్ కాంగ్రెస్ (అజిత్ పవార్ వర్గం) నుంచి మంత్రి దిలీప్ వాల్సే పాటిల్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై సీఎం షిండే మాట్లాడుతూ 'రేపు మనోజ్ జరంగే పాటిల్ నుంచి ప్రతినిధులు మరాఠా రిజర్వేషన్ కోసం క్యాబినెట్ సబ్‌కమిటీ సభ్యులతో తదుపరి చర్చల కోసం సమావేశమవుతారు. మేము మనోజ్ జరంగే పాటిల్‌కు డివిజనల్ కమిషనర్ ద్వారా సందేశం ఇస్తాము. నేను జరంగేను అభ్యర్థిస్తున్నాను. అతని డిమాండ్లు ఏమిటనే దానిపై మేము కృషి చేస్తున్నందున అతను నిరవధిక నిరాహార దీక్షను విరమించాలి' అని కోరారు.

రూ.2 కోట్లకు పైగా కుంభకోణం

(మొదటిపేజీ తరువాయి)

సొమ్ము రికవరీ చేశారు కానీ, దాన్ని జమ చేయలేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు అడ్డుపెట్టుకుని రూ.6 లక్షల లోన్లు బొక్కేశారు. సంఘంలో నగదు నిల్వ రూ.11 లక్షల 60 వేలు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. దీంతో విచారణ పూర్తి అయ్యేసరికి కోట్లాది రూపాయల అవినీతి బయటపడే అవకాశం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, ఉండి విశాల సహకార సంఘం పరపతి సంఘం సిఇఓ జి.వి.ప్రసాద్, కోలమూరు బ్రాంచ్ మేనేజర్ దుర్గారావుపై అభియోగాలు ఉన్నట్లు విచారణ అధికారి జి.సత్యనారాయణ వెల్లడించారు. సంఘం సహకార అధికారి ఫిర్యాదు మేరకు జిల్లా సహకార అధికారి చర్యలకు ఉపక్రమించారు. సెక్షన్-51 విచారణకు ఆదేశించి విచారణాధికారిగా జి.సత్యనారాయణను నియమించారు. రెండు నెలలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికను జిల్లా సహకార అధికారికి సమర్పించనున్నారు.

మోసం జరిగినట్లు గుర్తించాం: చైర్మన్ సూర్యనారాయణ రాజు

ఉండి విశాల సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణ రాజును జరిగిన అవకతవకలపై వివరణ కోరగా మేనేజర్ దుర్గారావు, సిఇఓ జి.వి.ప్రసాద్ పాత్రపై అనుమానాలు ఉన్నట్లు తెలిపారు. బాకీల వసూలు వేగవంతం చేయడంతో చాలా మంది రైతులు తన అప్పును చెల్లించామని చెప్పడంతో ఆ నగదును జమచేయకపోవడంతో మోసం జరిగినట్లు గుర్తించామన్నారు. తిరిగి రికవరీ చేయడానికి గడువు ఇచ్చినా తిరిగి చెల్లించకపోవడంతో తమ త్రిసభ్య కమిటీ ద్వారా సహకార అధికారులకు ఫిర్యాదు లేఖ పంపామని అన్నారు. దీంతో విచారణాధికారి జి.సత్యనారాయణ తనిఖీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రైలు ప్రమాదంలో కూలీలే సమిధలు

(మొదటిపేజీ తరువాయి)

ఆదుకుంటామని భరోసా కల్పించారు. ప్రమాద ప్రాంతాన్ని సందర్శించాలని భావించినా , కార్యక్రమాన్ని రద్దు చేసుకునీ విజయనగరం సర్వ జన ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయిలు, క్షతగాత్రులకు 2 లక్షల రూపాయిలు, ఇతర రాష్ట్రాల మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల రూపాయిలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం జగన్ పరిహారం ప్రకటించారు.

ప్రమాద కారణంగా సోమవారం 47 రైళ్లు రద్దుకావడంతో పాటు 24 రైళ్లను దారి మళ్లించారు. దీంతో వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి రైళ్ల రాకపోకలకు అవకాశం కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి నుంచే ఏడు సహాయక బృందాలు కార్యాచరణ లోకి దిగాయి.ప్రమాదకారణంగా భోగీలు నుజ్జునుజ్జవ్వడంతో భారీ క్రేన్ సహాయంతో వాటాని తొలగించే ప్రయత్నం చేశారు. ప్రధానంగా ఇంజన్ వేరుచేయడం అధికారులకు సవాల్ గా మారింది. మొత్తం మీద వారి ప్రయత్నం ఫలించడంతో విజయనగరం డౌన్ లైన్ లో గూడ్స్‌ను ట్రయల్ చేసి పరిస్థితి అంచనా వేసుకున్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ నేతృత్వంలో డి ఆర్ ఎం సౌరబ్ ప్రసాద్ పర్యవేక్షణలో వందలాది మంది కార్మికులు నిరంతరాయంగా పని చేశారు.మొత్తంమీద ట్రాక్ పునరుద్ధరించి యథావిధిగా రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. సోమవారం ప్రమాద స్థలాన్ని విజయనగరం జిల్లా ఇన్చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు పరిశీలించారు.

మోదీ పాలనలో ఉద్యోగ నష్ట వృద్ధి

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో దేశంలో ఉద్యోగాల పరిస్థితి పూర్తిగా దిగజారిందనీ, ఇటీవలి సంవత్సరాలలో ఉపాధి పొందిన వ్యక్తుల సంఖ్య కూడా పడిపోయిందని, ఈ పరిస్థితిని "ఉద్యోగ-నష్ట వృద్ధి"గా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 2 వ మహాసభల ప్రతినిధుల సభ సోమవారం, ఇక్కడి తెరపంత్ భవన్ (కామ్రేడ్ సిద్ది వెంకటేశ్వర్లు హాల్) లో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. వలి ఉల్లాహ్ ఖాద్రి అధ్యక్షతన ప్రారంభమైన ప్రతినిధుల సభలో తిరుమలై మాట్లాడుతూ, దేశ రాజ్యాంగంలోని సారాంశాన్ని, ఉనికినే సవాలు చేసే ఫాసిస్ట్ వాతావరణంలో మనం ఉన్నామని, యువత దీనిని తీవ్రంగా ప్రతిఘటించవలసిన అవసరముందని చెప్పారు. యువత హక్కులు, ప్రజాస్వామ్య, లౌకిక స్వభావం, జాతీయ ఐక్యతను కాపాడటానికి ఏఐవైఎఫ్ అవిశ్రాంత పోరాటాల తరంగాన్ని ఆవిష్కరించాలని అయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా వామపక్ష ప్రగతిశీల సంస్థలకు ఎన్ని అడ్డంకులు వచ్చినా, 'సోషలిజమే భవిష్యత్తు, భవిష్యత్తు మనది' అనే నినాదాన్ని కొనసాగించాలని ఆర్. తిరుమలై కోరారు. దేశం అంతటా ఉపాధి, విద్యలో యువత హక్కులను పొందే పోరాటాలలో ఏఐవైఎఫ్ ముందంజలో ఉందని గుర్తు చేశారు. సామూహిక పోరాటాల ద్వారా భారతీయ యువతలో విశ్వాసాన్ని పొంది, ఏఐవైఎఫ్ మన దేశంలో అతిపెద్ద యువజన సంస్థగా కొనసాగుతోందని చెప్పారు. పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల నేటి యువతలో సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని తిరుమలై ఆందోళన వ్యక్తం చేశారు.

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలన, మతవాదం, నకిలీ జాతీయవాదం మన రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని, అది మన శాస్త్రీయ స్వభావం, హేతుబద్ధ ఆలోచన, భావప్రకటన స్వేచ్ఛపై దాడి చేస్తుందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హక్కు జీవనోపాధి సమస్యల కోసం యువత పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను దూకుడుగా అనుసరించడం వల్ల నిరుద్యోగం, అసమానతలలో తీవ్ర పెరుగుదల ఉందని అయన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతూ మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు సృష్టిస్తూ, వివక్షాపూరిత చట్టాలు తెచ్చి మన దేశ లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదన్నారు. ప్రశ్నించే ప్రతి ప్రజాస్వామిక గొంతు కలను అణిచివేస్తూ, దేశ వ్యతిరేక ముద్ర వేస్తున్నారని, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ మోదీ ప్రభుత్వం ఎంత అణిచి వేసే ప్రయత్నాలు చేసినా యువత ప్రశ్నిస్తూ, సమస్యలపై నిలదీస్తూ స్థిరమైన పోరాటాలు కొనసాగిస్తూనే ఉండాలని కోరారు. సర్దార్ భగత్ సింగ్ వంటి అమరవీరులే మన పోరాటాలకు మూలం అని, భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో దేశ లౌకిక, ప్రజాస్వామ్య, బహుళ సాంస్కృతిక వ్యవస్థలను కాపాడుకోవడానికి ఏఐవైఎఫ్ ఒక శక్తివంతమైన యువజన ఉద్యమాన్ని నిర్మించాలని కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. వేదికపై సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, ఏఐవైఎఫ్ రాష్ట్ర నేతలు నిర్లేకంటి శ్రీకాంత్, లింగం రవి, వెంకటేశ్వర్లు, శంకర్, యుగంధర్, సురేష్, రామకృష్ణ, సత్యప్రసాద్ తదితరులు ఆశీనులయ్యారు, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర స్వాగతం పలికారు.

ఇజ్రాయిల్ దళాలు

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయినట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇందులో 3457 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. అక్టోబర్ 27న భూతల దాడులను ప్రారంభించిన ఇజ్రాయిల్ సేనలు.. నగరం నడిబొడ్డుకు చేరుకున్నట్లు సమాచారం. అక్కడి అల్ అజహర్ యూనివర్సిటీ సమీపంలో తలదాచుకున్నట్లు భావిస్తోన్న హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా దాడులు జరిపినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఇందులో అనేకమంది ఉగ్రవాదులు మరణించినట్లు తెలిపింది.

ఉత్తర గాజా నుంచి మరింత లోనికి యుద్ధ ట్యాంకులు ప్రవేశిస్తున్న వీడియోను ఐడీఎఫ్ విడుదల చేసింది. యుద్ధ ట్యాంకులతోపాటు ముందుకు కదులుతున్న సాయుధ బలగాలు.. భవనాల్లో దాక్కున్న హమాస్ ఉగ్రవాదులతో ఎదురు కాల్పులు జరుపుతున్న దృశ్యాలు అందులో ఉన్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయిల్ నగరం టెల్ అవీవ్‌పైకి పలస్తీనా మిలిటెంట్లు క్షిపణి దాడులు కొనసాగిస్తునే ఉన్నారు.

మా కుటుంబ సభ్యులను విడిపించండి

ఇజ్రాయిల్‌లో కొందరు మహిళలు సోమవారం హమాస్ మిలిటెంట్ల వద్ద బందీలుగా ఉన్న తమ పిల్లల ఫొటోలు ముద్రించి ఉన్న ప్లకార్డులతో ర్యాలీగా వెళ్లి... ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కలిశారు. హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న తమ కుటుంబసభ్యులను విడిపించాలని ఆయనతో మొర పెట్టుకున్నారు. అందర్నీ విడిపించాలని వాళ్లంతా ప్రధానికి విన్నవించారు. ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న పలస్తీనా ఖైదీలందరినీ విడుదల చేసి... మా పిల్లలందరినీ మాకు అప్పగించండి అని వాళ్లు నెతన్యాహును దీనంగా అభ్యర్థించారు. మరోవైపు ఖతర్, టర్కీ దేశాలు కూడా తమ దేశానికి చెందిన వారిని ప్రాణాలతో వదిలేయండని హమాస్‌తో చర్చలు జరుపుతున్నాయి.

జర్మన్-ఇజ్రాయెల్ యువతి మృతి

హమాస్ మిలిటెంట్లు కిడ్నాప్ చేసిన జర్మన్-ఇజ్రాయిల్ యువతి షానీ లౌక్ (23) మృతి చెందింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. షానీ లైక్ మృతదేహాన్ని తాజాగా ఇజ్రాయిల్ సైన్యం గుర్తించింది. గాజాలోకి ప్రవేశించిన తమ దళాలు షానీ లౌక్ మృతదేహాన్ని గుర్తించాయని ఇజ్రాయిల్ సర్కారు వెల్లడించింది. షానీ కుటుంబం కూడా ఆమె మృతిని సోషల్ మీడియా ద్వారా ధ్రువీకరించింది. 'జర్మన్-ఇజ్రాయిల్ యువతి షానీ లౌక్ మృతదేహాన్ని గుర్తించాం. ఆమె మృతి గురించి తెలిసి మా హృదయం ముక్కలైంది. షానీని మ్యూజిక్ ఫెస్టివల్ నుంచి హమాస్ మిలిటెంట్లు అపహరించారు. ఆమెను తీవ్రంగా వేధించారు. తర్వాత గాజా నగరం మొత్తం పికప్ ట్రక్కులో నగ్నంగా ఊరేగించారు. హమాస్ చేతిలో ఆమె అంతులేని వేదనను అనుభవించారు. ఆమె పరిస్థితితో మా హృదయం ముక్కలైంది' అని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ట్వీట్ చేసింది. 'మాకు ఒక వీడియో వచ్చింది. ఆ వీడియోలో కారులో అపస్మారక స్థితిలో ఉన్న నా కుమార్తెను చూశాను. ఆ కారును గాజా నగరమంతా తిప్పడం కనిపించింది' అని మృతురాలు షానీ తల్లి వాపోయింది.

అమాయక ప్రజలను రక్షించండి: నెతన్యాహుకు బైడెన్ ఫోన్

ఇజ్రాయిల్ దాడుల్లో వేల సంఖ్యలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటంపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో గాజాలోని అమాయక ప్రజలను రక్షించాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సూచించారు. ఈ మేరకు ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు తో బైడెన్ ఫోన్‌లో మాట్లాడారు.

హమాస్ మిలిటెంట్లు, పౌరుల మధ్య తేడాను గుర్తించాలని బైడెన్ కోరారు. ఈ యుద్ధంలో గాజాలోని ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా రక్షించాలని సూచించారు. పౌరుల రక్షణకు ప్రాధాన్యతనిచ్చే అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ఇజ్రాయిల్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉందని... అదే సమయంలో పౌరులకు రక్షణ కల్పించాల్సిన అవసరం కూడా ఉందని అన్నారు.

ఎంఎస్‌ఎంఈలకు పునరుజ్జీవం

(మొదటిపేజీ తరువాయి)

అనూహ్య మార్పులు వస్తున్నాయని, పరిశ్రమల ఉత్పాదకతలో సాంకేతికంగా వస్తున్న విప్లవాత్మక మార్పులను అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రపంచ పారిశ్రామిక రంగం పోకడలను అవగతం చేసుకోవాలని, తద్వారా పారిశ్రామిక విధానాల్లో మార్పులు, చేర్పులు చేయాలని సీఎం మార్గనిర్దేశనం చేశారు. అత్యంత పారదర్శకత విధానాల ద్వారా రాష్ట్రంలో అత్యంత సానుకూల వాతావరణాన్ని తీసుకురాగలిగామని, దానివల్లే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకుల్లో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచామన్నారు. ఈ ప్రయాణం మరింతగా ముందుకు సాగాలన్నారు. పరిశ్రమల పట్ల సానుకూల క్రియాశీలతను మరింత బలోపేతం చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకోసం ఇచ్చే అనుమతులు, తదితర అంశాల్లో ఏ సమస్య ఉన్నా ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉన్నామన్న భరోసాను వారికి మనం కల్పించాలన్నారు. అలాగే అనుమతులు, క్లియరెన్స్ విషయంలో ఇప్పుడున్న వేగాన్ని మరింతగా పెంచాలని సీఎం ఆదేశించారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు విషయంలో కూడా మరింత వేగం పెంచాలన్నారు.

ఎస్‌ఐపీబీ ఆమోదం పొందిన కంపెనీల వివరాలివే

- చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్న పెప్పర్ మోషన్ కంపెనీ రూ.4,640 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా 8,080 మందికి ఉద్యోగాలు.
- విజయనగరం జిల్లా ఎస్.కోటలో జేఎస్ డబ్ల్యు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం. రూ.531 కోట్లు పెట్టుబడి, 35,750 మందికి ప్రత్యక్షంగానూ, 9,375 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.
- శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో శ్రేయాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు. రూ.1,750 కోట్ల పెట్టుబడి, 2,000 మందికి ప్రత్యక్షంగానూ, మరో 500 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.
- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో స్మైల్ (సబ్‌స్ట్రేట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా లిమిటెడ్ ఎంటర్‌ప్రైజెస్)కంపెనీ అధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారీ యూనిట్. రూ.166 కోట్ల పెట్టుబడి, దాదాపు 5 వేలమందికి ఉద్యోగాలు.
- నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద థర్మల్ పవర్ స్టేషన్‌లో కొత్త తరహా, సాంప్రదాయేతర పర్యావరణహిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటుకు ఎస్ఐపీబీ ఆమోదం. రూ.6,174 కోట్ల పెట్టుబడి, 600 మందికి ప్రత్యక్షంగానూ, 2,000 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.
- తూర్పుగోదావరి జిల్లా కడియం వద్ద ఆంధ్రాపేపర్ లిమిటెడ్ విస్తరణ. రూ.4 వేల కోట్ల పెట్టుబడి, 3 వేల మందికి ఉద్యోగాలు.
- విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఏటీసీ టైర్స్ లిమిటెడ్ విస్తరణ. రూ.679 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు.
- తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలో ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ విస్తరణ. రూ.933 కోట్ల పెట్టుబడి, 2,100 మందికి ఉద్యోగాలు.
- ఏలూరు జిల్లా కొమ్మూరు వద్ద రూ.114 కోట్ల పెట్టుబడి పెట్టనున్న శ్రీ వెంకటేశ్వర బయోటెక్ లిమిటెడ్. 310 మందికి ఉద్యోగాలు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేశ్, గుడివాడ అమర్నాథ్, ఆర్‌కే రోజా, సీఎస్ జవహర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు రజత్ భార్గవ, విజయానంద్, ఎస్.ఎస్.రావత్, యువరాజ్, కె.సునీత, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రభాకరరెడ్డిపై హత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

మండలం సూరంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ప్రభాకర్ రెడ్డి పై కత్తితో గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశారు. పక్కనే ఉన్న గన్‌మెన్ వెంటనే తేరుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయినా కూడా కత్తిపోటు నుండి మాత్రం ప్రభాకర్ రెడ్డిని కాపాడలేకపోయారు. దాడి అనంతరం ఎంపీ ప్రభాకర్ రెడ్డిని ముందుగా గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ లో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. కాగా దాడి చేసిన వ్యక్తిని పట్టుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సదరు వ్యక్తిని చితకబాదారు. అనంతరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డిపై హత్యాయత్నాన్ని మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. విషయం తెలిసిన వెంటనే హరీశ్‌రావు ఆసుపత్రికి చేరుకుని ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం వైద్యులతో ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభాకర్ రెడ్డిపై దాడి అత్యంత గర్హనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, ఈ ఘటనను ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు.

ఉల్లి @ 80

(మొదటిపేజీ తరువాయి)

మధ్యప్రదేశ్ నుంచి ఉల్లిపాయలను పొందడం ప్రారంభించాము. ఇది క్రమంగా మా సరఫరాను సాధారణీకరిస్తుంది. కానీ ధరలు తగ్గడానికి మరో పక్షం రోజులు పడుతుంది' అని హసన్‌పురాలోని కూరగాయల మార్కెట్‌లో రిటైలర్ రామ్ ప్రతాప్ సైనీ అన్నారు. ఇక కర్నాటక ఉత్తర ప్రాంతంలో తీవ్రమైన కరువు లాంటి పరిస్థితులు కారణమని చెప్పవచ్చు, ఫలితంగా ఉల్లి ఉత్పత్తి తగ్గింది. ఉల్లిని పండించే ప్రాంతాలలో సాధారణ పంట తక్కువగా ఉంది. బెంగళూరులో టోకు ధరలు గత వారం రూ.50 ఉండగా ఆదివారం కిలో రూ.70కి చేరాయి. నిత్యావసర కూరగాయ విక్రయదారుడికి చేరగానే రూ.80 ఉండగా, ఆదివారం నాటికి ఆన్‌లైన్‌లో రూ.69కి విక్రయిస్తున్నారు. మల్లేశ్వరంలోని వెంకటేశ్వర తాజా కూరగాయలు, హోల్ సేల్ మార్కెట్ యజమాని వెంట్రి మాట్లాడుతూ పరిస్థితి ఉల్లిగడ్డలదే... ఈ వారం తరువాత, ధరలు రూ.100 దాటవచ్చు' అని తెలిపారు. మరో రెండు నెలల వరకు ధరలు తగ్గే అవకాశం లేదని యశ్వంత్‌పూర్‌లోని శివాజీ ట్రేడర్స్ యజమాని మంజునాథ్ అన్నారు. హుబ్లీలోని స్థానిక రైతుల నుంచి సరఫరా కొరత మధ్య, మార్కెట్‌కు మహారాష్ట్ర, పొరుగున ఉన్న విజయపుర జిల్లా నుంచి ఉల్లిని తీసుకువస్తున్నారు. హుబ్లీ ఏపీఎంసీలో ఉల్లి ధర క్వింటాల్‌కు రూ.2,500-3,000 నుంచి రూ.6,000-6,600 వరకు పెరిగింది. అదే విధంగా, రిటైల్ మార్కెట్‌లో ఉల్లిపాయల ధర కేవలం వారం రోజుల్లోనే కిలోకు రూ.30-35 నుంచి రూ.75-80కి పెరిగింది.

ఉత్పత్తి తగ్గడమే కారణమా?

ఉల్లి ధరల పెరుగుదలకు వివిధ కారణాలున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఉత్పత్తిలో కొరత ఏర్పడటమే కాకుండా... పండగ సీజన్ కావడం వల్ల వినియోగం పెరిగిందని ఫలితంగా డిమాండ్ ఏర్పడి ధరలు అమాంతం పెరిగిపోయాయని అంటున్నారు. ఢిల్లీ, రాజధాని పరిసర ప్రాంతాల్లోని రిటైల్ మార్కెట్‌లో కేజీ ఉల్లి ధర రూ.65-80 వరకు పలుకుతోందని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లోనూ ఇంకాస్త ఎక్కువకే అమ్ముతున్నారు. ఉల్లి ఎక్కువగా పండే మహారాష్ట్రలో ఇటీవల చోటు చేసుకున్న భారీ వర్షాల వల్ల పంటలు చాలా వరకు దెబ్బతిన్నట్లు ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా దిగుబడి బాగా తగ్గిపోవడంతో పాటు పంట చేతికందడం కూడా ఆలస్యమవుతోందని అంటున్నారు. సాధారణంగా ఈ సమయానికి ఖరీఫ్ పంట మార్కెట్‌లోకి రావాల్సి ఉందనీ, అది ఆలస్యమవ్వడమే ధరలు మండటానికి ప్రధాన కారణమని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, అఖిల భారత సగటు రిటైల్ ధర శుక్రవారం కిలోకు రూ.47కు పెరిగింది. క్రితం ఏడాది కాలంలో కిలో రూ.30గా ఉంది. దేశ రాజధానిలో ఉల్లి రిటైల్ ధర శుక్రవారం కిలోకు రూ.40గా ఉంది. ఏడాది కాలంలో కిలో రూ.30గా ఉన్నట్లు పేర్కొంది. 'మేము ఆగస్టు మధ్య నుంచి అదనపు ఉల్లి నిల్వలను ఆఫ్‌లోడ్ చేశాము. ధరల పెరుగుదలను అరికట్టడానికి, వినియోగదారులకు ఉపశమనం కలిగించడానికి మేము రిటైల్ విక్రయాలను వేగవంతం చేస్తున్నాము' అని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ పీటీఐకి చెప్పారు. మంత్రిత్వ శాఖ ప్రకారం, ధరలు భారీగా పెరిగిన రాష్ట్రాల్లోని హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలతో అదనపు నిల్వల నుంచి ఉల్లిని మార్కెట్‌లోకి తీసుకువస్తున్నారు. ఆగస్టు మధ్య నుంచి 22 రాష్ట్రాలలో వివిధ ప్రదేశాలలో సుమారు 1.7 లక్షల టన్నుల అదనపు ఉల్లి నిల్వలు చేయబడ్డాయి. రిటైల్ మార్కెట్లలో అదనపు ఉల్లిని రెండు సహకార సంస్థలు ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ విక్రయ కేంద్రాలు, వాహనాల ద్వారా కిలోకు రూ.25 సబ్సిడీ ధరతో విక్రయిస్తున్నారు. ఢిల్లీలో కూడా అదనపు ఉల్లిని ఈ సబ్సిడీ ధరకే విక్రయిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎన్‌సీసీఎఫ్, నాఫెడ్ ద్వారా 5 లక్షల టన్నుల అదనపు ఉల్లి నిల్వలను నిర్వహించింది. రాబోయే రోజుల్లో అదనంగా 2 లక్షల టన్నుల ఉల్లిపాయలను సేకరించాలని యోచిస్తోంది.

ప్రతికూల వాతావరణ పరిస్థితులు

దేశంలోని తాజా ఖరీఫ్ ఉల్లిపాయల సరఫరా హెచ్చుతగ్గుల వాతావరణ పరిస్థితుల కారణంగా ధరల పెరుగుదలకు దారితీసింది. సాధారణంగా అక్టోబరులో వచ్చే పంట ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యమవడం, వేడిగాలుల కారణంగా డిసెంబరులో వచ్చే అవకాశం ఉంది. పెరుగుతున్న ధరలను నియంత్రించడానికి, దేశీయ మార్కెట్‌లలో లభ్యతను పెంచడానికి డిసెంబరు 31 వరకు ఉల్లిపాయలపై కనీస ఎగుమతి ధర 800 డాలర్లు విధించింది.

సామాజిక సంక్షేమ పింఛన్లను రూ.6 వేలకు పెంచాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-భీమవరం : వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళలకు ఇస్తున్న సామాజిక సంక్షేమ పింఛన్లను రూ.6 వేలకు పెంచాలని, వివిధ ప్రతిభావంతులకు ఇచ్చే పింఛన్లు రూ.7 వేలకు పెంచాలని, సామాజిక సంక్షేమ పింఛన్లకు అర్హత వయస్సు 50 ఏళ్లకు తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సామాజిక పెన్షనర్ల జిల్లా సదస్సు వీరమ్మ చెరువు పార్కు (బీవీ రాజు పార్క్) వద్ద అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో నామన వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముప్పాళ్ల మాట్లాడుతూ నాడు సీపీఐ జాతీయ స్థాయిలో చేసిన పోరాటాల ఫలితంగా ఇందిరాగాంధీ సామాజిక పింఛన్లను అమలు చేశారని, నాడు 25 రూపాయలు ఇచ్చిన పింఛన్ నేటికి రూ.3 వేలకు చేరిందని తెలిపారు. వృద్ధాప్యంలో వీరి మందుల ఖర్చులే రూ.5 వేలు దాటిపోతోందని, ఇక వాళ్లేమి తింటారని, ఇది ఎంత మాత్రం చాలదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అడక్కుండానే హామీలిస్తున్న రాజకీయ పార్టీలు 28 విభాగాల్లో ఇస్తున్న సామాజిక సంక్షేమ పింఛనుదారులకు ఎంత పెంచుతారో స్పష్టత ఇవ్వాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్లు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రత్యేక ఆరోగ్య బీమా ఏర్పాటు చేయాలని, రాష్ట్ర జనాభాలో 60 లక్షల మంది వృద్ధులున్నారని, వారు ఎంతో నిరాదరణకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2007 వృద్ధుల సంక్షేమ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, వృద్ధులకు ప్రత్యేకించి మంత్రిత్వ శాఖ, లేదా కమిషనరేట్ ఏర్పాటు చేయాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పరిధిలో ప్రభుత్వం వృద్ధాశ్రమాలను నిర్వహించాలని, వృద్ధులకు ఉచిత వైద్య సదుపాయాలు కల్పించి, మందులు ఇవ్వాలని, ఆరోగ్య పరీక్షలు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి, యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని కోరారు. నవంబరు 8న విజయవాడలో జరిగే సామాజిక సంక్షేమ పింఛనర్ల రాష్ట్ర సదస్సులో పింఛనర్ల డిమాండ్లపై సమరభేరి ప్రకటిస్తామని చెప్పారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఇప్పుడిస్తున్న పింఛన్లు ధరల రీత్యా ఎంతమాత్రం సరిపోవని, పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు. వృద్ధులయిన పింఛనుదారులు నిరాదరణకు గురవుతున్నారని, వారికి భద్రత, భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, వృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ కన్వీనర్ మేళం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2007 వృద్ధుల సంక్షేమ చట్టం, 2011లో సవరించిన చట్టం వృద్ధులకు ఎంతో మేలుచేసేవిగా ఉన్నాయని తెలిపారు. తమ సంతానం నుంచి నిరాదరణకు గురవుతున్న వృద్ధులు, వారి ఆస్తులను రివర్స్ మార్టుగేజ్ కింద పెట్టి లబ్ధి పొందే విధానాన్ని వివరించారు. ఇప్టా జాతీయ సమితి సభ్యులు గని మాట్లాడుతూ వృద్ధాప్యంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపైనా, తమ సంతానం మూలంగా నిరాదరణకు గురయ్యి పడుతున్న మానసిక వేదనపైనా గీతాలు ఆలపించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సికిలే పుష్పకుమారి తదితరులు మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాయకులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, బొద్దాని నాగరాజు, కళింగ లక్ష్మణరావు, టీ.అప్పలస్వామి, జిల్లా సమితి సభ్యులు మండల నాగేశ్వరరావు, సనపల శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీపతి, మల్లుల శ్రీనివాస్, యేలేటి విజయానంద్, చంటి రాజు, సుందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు ఈ విధంగా ఉన్నాయి. వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళలకు ఇస్తున్న సామాజిక సంక్షేమ పింఛన్లను రూ.6 వేలకు పెంచాలి. వివిధ ప్రతిభావంతులకు ఇచ్చే పింఛన్లు రూ.7 వేలకు పెంచాలి. సామాజిక సంక్షేమ పింఛన్లకు అర్హత వయస్సును 50 ఏళ్లకు తగ్గించాలి. అసెంబ్లీలో పరిధిలో ప్రభుత్వమే వృద్ధాశ్రమాలను నిర్వహించాలి. వృద్ధులకు ఉచిత వైద్య సదుపాయాలు కల్పించి మందులు ఇవ్వాలి, ఆరోగ్య పరీక్షలు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. 2007 వృద్ధు సంక్షేమ చట్టం, 2011లో సవరించిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలి. రివర్స్ మార్టుగేజ్ కింద వృద్ధుల ఆస్తులపై బ్యాంకర్లు రుణాలివ్వాలి.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా పెన్షనర్ల సంక్షేమ సమాఖ్య అధ్యక్షునిగా ఎం.లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా నామాన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా మోర్చ రాజేష్, సహాయ కార్యదర్శిగా నాగిడి గోవిందుతో పాటు మరో ఏడుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు విద్యార్థులు, యువజనులు సిద్ధం కావాలి

- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకుల పిలుపు
- విద్యాసంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ కోసం జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 8న తలపెట్టిన విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం దాసరి భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, పీడీఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, ఐసా రాష్ట్ర నాయకులు మహేష్ తదితరులు మాట్లాడుతూ లాభాలనార్జిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసి అదానీకి అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికులు, ప్రజాసంఘాలు చేస్తున్న ఆందోళన నవంబర్ 8 నాటికి 1000 రోజులవుతున్న సందర్భంగా వామ పక్ష విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో బందు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటయితే రాయలసీమ ప్రాంత నిరుద్యోగులకు ఎంతో ఉపయోగ పడుతుందని, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం కావడంతో పాటు వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకుండా మోసం చేసిందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సమరశీల పోరాటానికి విద్యార్థి, యువజనులు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా మోసం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, విభజన హామీలు, విశాఖ ఉక్కు పరిరక్షను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయి కుమార్, నగర అధ్యక్షులు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భువనేశ్వరి మలివిడత పర్యటన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుపై నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' మలివిడత కార్యక్రమం ఉత్తరాంధ్రలో మూడు రోజుల పాటు జరగనుంది. నవంబరు 1వ తేదీ నుంచి 3 తేదీ వరకు నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భువనేశ్వరి పర్యటించనున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై మనోవేదనతో మృతి చెందిన వారి కుటుంబాలను ఈ సందర్భంగా ఆమె పరామర్శిస్తారు. 1వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస, 2వ తేదీన విజయనగరం జిల్లాలోని ఎచ్చర్ల, బొబ్బిలి, 3వ తేదీన విజయనగరం నియోజకవర్గాల్లో నిజం గెలవాలి కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు సభల్లో ఆమె పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. విజయనగరం రైలు ప్రమాద బాధితులను కూడా భువనేశ్వరి 31వ తేదీన అక్కడి ఆసుపత్రిలో పరామర్శిస్తారు. మంగళవారం రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి విజయనగరం ప్రభుత్వాసుపత్రికి వెళతారు. బాధితుల పరామర్శ అనంతరం ఆముదాలవలస వెళ్లి అక్కడ బస చేస్తారు.

వ్యవసాయాన్ని నాశనం చేస్తున్న పాలకులు

సమష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం : కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వనాశనం చేస్తున్నాయని, రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితులు కల్పిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో దేగల అప్పలరాజు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభను సోమవారం నిర్వహించారు. ఈ సభలో కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడలో నవంబర్ 27, 28తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్రంలోని రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నామని, అక్కడే ఆట, పాట, పడక చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై చేసి నిరసన చెప్పే కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. పోలవరం కాలువ కోసం, జాతీయ రహదారుల కోసం రైతులు నుంచి తక్కువ పరిహారం ఇచ్చి భూములను లాక్కునే విధానం అమలు జరుగుతున్నదని, అందరు సమష్టి పోరాటాలతో మన సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామే శ్వరరావు మాట్లాడుతూ పాలకులు రైతును విస్మరిస్తున్నా రన్నారు. జిల్లాలో ఒక వైపు భోగాపురం ఎయిర్ పోర్టు, పోలవరం కాలువ, జాతీయ రహదార్లకు పోయే భూములతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇక్కడి నాయకులు పెత్తందార్ల తరపునుండి పేద రైతులను పట్టించుకోకుండా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధులు రైతు సమస్యల పరిష్కారంలో చొరవ చూపడం లేదని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని, పైపెచ్చు ఎరువులు, పురుగు మందుల్లో కల్తీని కూడా నివారించడం లేదని విమర్శించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, మన్యం జిల్లా కార్యదర్శి అప్పలనాయుడు మాట్లాడుతూ ఇది బటన్ ప్రభుత్వమే గానీ ప్రజా ప్రభుత్వం కాదన్నారు. రైతులను ఆదుకోవడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ మాట్లాడుతూ రైతులందరు ఐకమత్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన దేగల అప్పలరాజు మాట్లాడుతూ రైతులకు తెలియకుండా రైతుల భూముల్లోకి అధికారులు, సర్వేయర్లు రావడం తగదని, రైతుల్లో ఐక్యత లోపించడమే ఇందుకు కారణం అని, రైతులను ఓటర్లుగానే చూస్తున్నారని, సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. సభలో అనేక తీర్మానాలు చేసి ఆమోదించారు.

ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌కు ఆర్టీసీ చైర్మన్ పరామర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కావలి బైపాస్ రోడ్డులో దుండగుల దాడిలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌ను రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఏ మల్లికార్జునరెడ్డి సోమవారం విజయవాడలోని ఏపీఎస్ఆర్టీసీ సెంట్రల్ ఆస్పత్రిలో పరామర్శించారు. దాడి ఘటనపై వివరాలు తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఆందోళన పడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. అతనికి పండ్లు అందజేసి త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. బాధితునికి భరోసా కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్య వైద్యాధికారి డాక్టర్ డీవీఎస్ అప్పారావుతోపాటు సంబంధిత వైద్యాధికారులకు ఆయన సూచించారు. చైర్మన్ మాట్లాడుతూ అనునిత్యం అంకిత భావం, క్రమశిక్షణ తో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగిపై దుర్మార్గంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అలా చేసిన వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. దాడికి యత్నించిన దుండగులపై ఇప్పటికే అనేక సెక్షన్లతో కూడిన కేసులు నమోదయ్యాయని, వారికి తగిన శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ పి. శ్రీనివాస్, ఇతర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను కాలరాస్తున్న పాలకులు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు

విశాలాంధ్ర-కురుపాం: గిరిజనాభివృద్ధి, సంక్షేమ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజా రక్షణభేరి పేరిట నిర్వహిస్తున్న బస్సుయాత్రకు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో సీపీఎం శ్రేణులు, గిరిజనులు వివిధ వర్గాల ప్రజల ఘనంగా స్వాగతం పలికారు. పెట్రోల్ బంక్‌జంక్షన్‌లో గిరిజన సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. పెట్రోల్ బంక్ నుంచి రావడ రోడ్డు జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రాఘవులు మాట్లాడుతూ గిరిజనులు పోరాడి సాధించుకున్న చట్టాలను సవరించి బీజేపీ ప్రభుత్వం దోపిడీ చేస్తున్నదన్నారు. అభివృద్ధి పేరుతో అటవీ భూములను ధ్వంసం చేసి అందులో నిక్షిప్తమైన గనులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. ఇందుకోసం పీసా చట్టానికి విఘాతం కలిగిస్తున్నదన్నారు. మరోవైపు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తగినంతగా కేంద్ర ప్రభుత్వం కేటాయించట్లేదని చెప్పారు. గిరిజన బతుకులు నాశనం చేసే ప్రతి చట్టానికి వైసీపీ, టీడీపీలకు చెందిన ఎంపిలు చేతులెత్తి మరి మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. వీటికి తోడు జనసేన కూడా బీజేపీతో జతకట్టిందని విమర్శించారు. ఈ మూడు పార్టీలు తోడుదొంగలుగా మారి గిరిజనుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తున్నాయని చెప్పారు. ఋషికొండ ను తవ్వేసి 40 కోట్లతో భవనాలు నిర్మిస్తున్న సీఎం జగన్ కు రాష్ట్రంలోని అభివృద్ధి సమస్యలు పట్టడం లేదన్నారు. ట్రైబల్ అడ్వైజర్ కమిటీ ఏర్పాటు కోసం కూడా వీరు ప్రయత్నం చేయడం లేదని రాఘవులు అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. అవినాశ్ అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఇందిర , చెముడుగూడ ఎంపీటీసీ ఎం. రమణ, మండల కార్యదర్శి కె. శ్రీనివాసరావు మాట్లాడారు.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడి కేసు విజయవాడ కోర్టుకు బదిలీ చేయాలి

డీజీపీకి ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ డ్రైవర్లపై దాడిచేసిన దుండగుల కేసు కావలి కోర్టులో ఉంటే... విచారణ సమయంలో దుండగుల వల్ల బాధిత డ్రైవర్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని, తక్షణమే ఆ కేసును విజయవాడకు తరలించాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నర్సయ్య యూనియన్ తరపున సోమవారం లేఖ రాశారు. ఈ లేఖపై యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యం రాజు, ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు సంతకం చేశారు. ఆర్టీసీ డ్రైవర్లపై దాడి చేసిన వారంతా నేరచరిత్ర గలవారని పోలీసులు చెబుతున్నందున అరెస్టులో జాప్యంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని యూనియన్ నేతలు పేర్కొన్నారు. ఉద్యోగులపై దాడిచేస్తే ఎలాంటి శిక్షలు పడతాయో, ప్రజలందరికీ తెలిసేలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్ స్టాండ్లు, బస్సులలో సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. బెంగళూరు-విజయవాడ మార్గంలో విధి నిర్వహణలో వున్న ఆటోనగర్ డిపో డ్రైవర్ బి.రాంసింగ్ రోడ్డుకు అడ్డంగా ఉన్న కారు అడ్డం తొలగించాలని హారన్ కొట్టగా... రెండు కార్లలో బస్సును వెంబడించి న 14మంది రౌడీ మూకలు మద్దూరుపాడు వద్ద ఆయనను బస్సు నుంచి కిందికి లాగి పాశవికంగా దాడి చేశారని గుర్తుచేశారు. ఈ దుర్ఘటనలో సదరు డ్రైవర్ తీవ్రమైన దెబ్బలు తగిలి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడి ఆసుపత్రి పాలయ్యారని తెలిపారు. దాడికి పాల్పడ వద్దని రౌడీ మూకను బతిమిలాడుకున్న రెండో డ్రైవర్‌నూ కొట్టారన్నారు. సంఘటనను అడ్డగించిన బస్సులోని ప్రయాణికులను సైతం దూషిస్తూ వారి సెల్ ఫోన్లను ధ్వంసం చేశారన్నారు. ఈ దాడి సంఘటనను ప్రత్యక్ష సాక్షులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్ పెట్టారని తెలిపారు. దీంతో నిత్యం ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, వారి కుటుంబ సభ్యులు అభద్రతా భావానికి లోనై తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఆర్టీసీ ఉద్యోగి, వారి కుటుంబ సభ్యుల్లో ధైర్యం నింపేలా చర్యలు ఉండాలని కోరారు. ఈ సంఘటనలో 14 మంది పాల్గొనగా కావలి పోలీసులు ఇప్పటికి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ప్రకటించారని తెలిపారు. ఈ దాడిలో కొద్ది మందినే అరెస్టు చేశారని... పరారీలో ఉన్న ఏడుగురిలో అసలు ముద్దాయిలుగా ఉన్నందున ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే మిగిలిన ప్రధాన నిందితులందర్నీ అరెస్టు చేసి కఠిన శిక్షలు పడేలా చూడాలని కోరారు. అసలైన నిందితుల అరెస్టులో పోలీసులు జాప్యం చేస్తే మాత్రం మలిదశ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా చేపడతామన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కొంతమంది దుండగులను అరెస్టు చేసినందుకు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

సిఆర్ బ్రాడ్‌కాస్టింగ్ హైదరాబాద్ లిమిటెడ్

(CIN : U93000TG2000PLC033883) email : accounts@99tv.com

రిజిష్టర్డ్ ఆఫీస్ : 3-5-912, మూడవ అంతస్తు, హిమాయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ - 500029

నోటీసు

వార్షిక జనరల్‌బాడీ సమావేశం (ఏజిఎం) నోటీసులో ప్రస్తావించబడిన లావాదేవీలను నిర్వహించడానికి **నవంబరు 25, 2023, శనివారం సాయంత్రం 03.00గం॥లకు** డోర్ నెం.3-6-201, రాజ్‌బహదూర్‌గౌర్ హాలు, హిమాయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ-500029లో సిఆర్ బ్రాడ్‌కాస్టింగ్ హైదరాబాద్ లిమిటెడ్ (ది కంపెనీ) సభ్యుల 23వ వార్షిక సమావేశం జరుగుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడినది.

కంపెనీ వార్షిక నివేదిక వాటాదారులకు కొరియర్ ద్వారా అక్టోబరు 30, 2023న పంపబడినదని గమనించగలరు.

ఈ-ఓటింగ్ : 2013 కంపెనీల చట్టం సెక్షన్ 108కి అనుగుణంగా దానికింద వర్తించే నిబంధనల మేరకు నోటీసులో రూపొందించిన అన్ని తీర్మానాలపై సిడిఎస్ఎల్ ప్లాట్‌ఫారం ద్వారా ఎలక్ట్రానిక్ ఈ ఓటింగ్ ద్వారా ఓటింగ్ సభ్యులకు సౌకర్యం కల్పించేందుకు కంపెనీ ఏర్పాటు చేసినట్లు తెలియజేయడానికి సంతోషిస్తున్నది. న్యాయమైన, చట్టపరంగా పారదర్శక పద్ధతి ప్రకారం ఈ-ఓటింగ్ నిర్వహించడానికి స్క్రూటినైజర్‌గా ప్రాక్టీసింగ్ కంపెనీ కార్యదర్శి **శ్రీ ఎం. రమణారెడ్డి**ని బోర్డు నియమించినది. కంపెనీ చట్టం 2013 నిబంధనలకు అనుగుణంగా చేపట్టుటకు ఈ విషయంలో నిబంధనల వివరాలు ఈ దిగువన ఇవ్వబడినాయి.

1. 2022-2023వరకు కంపెనీ 23వ వార్షిక సమావేశం నోటీసు మరియు కంపెనీ వార్షిక నివేదిక అక్టోబరు 27, 2023 వరకు వాటాలు కలిగియున్న సభ్యులందరికీ పంపబడినది. అక్టోబరు 30, 2023వ తేదీన ఏజీఎం నోటీసు పంపించడం పూర్తయింది. అనుమతించబడిన పద్ధతిలో సభ్యులకు నమోదు చేసుకున్న చిరునామాకు 2022-23 వార్షిక నివేదికతో పాటు నోటీసు పంపబడినది.
2. ఈ ఓటింగ్ వ్యవధి బుధవారం, 22 నవంబరు 2023 ఉ॥ 9.00గం॥లకు ప్రారంభమై శుక్రవారం, 24 నవంబరు 2023, సా॥ 5.00గం॥లకు ముగుస్తుంది.
3. ఈ-ఓటింగ్ ద్వారా సభ్యులు ఓటు వేసేందుకు అర్హతను నిశ్చయించేందుకు కంపెనీ నవంబరు 18వ తేదీని కటాఫ్ తేదీగా ఖరారు చేసింది. 23వ ఏజీయం సందర్భంగా ఓటింగు 25న నవంబరు, 2023 జరుగుతుందని షెడ్యూలు ప్రకటించబడినది.
4. కంపెనీ ఏజియం నోటీసు పంపిన, తరువాత షేర్లు సేకరించి, కంపెనీ సభ్యుడైన, కటాఫ్ తేదీ నాటికి షేర్లు కలిగి ఉన్న ఏ వ్యక్తి అయినా వార్షిక నివేదికలో లభ్యమయ్యే ఈ-ఓటింగ్ సూచనలను, మరియు కంపెనీ వెబ్‌సైట్‌లో లభ్యమయ్యే సూచనలను ప్రస్తావించవచ్చును. అయితే, ఈ-ఓటింగ్‌కు ఇప్పటికే సిడిఎస్ఎల్‌లో నమోదైన వ్యక్తులు ఓటు వేసేందుకు ఉన్న యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ ఉపయోగించవచ్చును.
5. **సభ్యులకు గమనిక :**
   ఎ) శుక్రవారం 24, నవంబరు 2023, ఐఎస్‌టి 5.00గం॥లకు మించి ఎలక్ట్రానిక్ మోడ్ ద్వారా రిమోట్ ఈ-ఓటింగ్ సిడిఎస్ఎల్ ద్వారా అనుమతించబడదు.
   బి) సభ్యులు ఒకసారి తీర్మానాలపై ఓటు చేసిన తరువాత మార్చుకోవడానికి అనుమతించబడదు.
   సి) రిమోట్ ఈ-ఓటింగ్ ద్వారా ఓటు చేయని సభ్యులకు, ఏజియంలో సభ్యులు బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేయడానికి అనుమతించబడే సౌకర్యం ఉంది.
   డి) రిమోట్ ఈ-ఓటింగ్ ద్వారా ఓటు వేసిన సభ్యులు ఏజియంకు హాజరు కావచ్చును. కానీ, తిరిగి ఓటు వేసేందుకు అర్హులుకారు.
6. రిమోట్ ఈ-ఓటింగ్‌కి సంబంధించి ఏవైనా ప్రశ్నలకు, ఫిర్యాదులకు సభ్యులు తరచుగా అడిగిన ప్రశ్నలను (ఎఫ్ఎక్యూస్) హెల్ప్ సెక్షన్ కింద వచ్చే www.evotingindia.comలో లభ్యమయ్యే ఈఓటింగ్ మాన్యువల్‌ను ప్రస్తావించవచ్చును లేదా helpdesk.evoting@cdslindia.com ఈమెయిల్‌కి వ్రాయవచ్చు. లేదా, 3-5-912, మూడవ అంతస్తు, హిమాయత్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ-500029లో కంపెనీ రిజిష్టర్డ్ ఆఫీసు కలిగి ఉన్న కంపెనీ సిఎఫ్ఓ **శ్రీ వయ్యకంటి చెన్నకేశవరావు**ను సంప్రదించవచ్చును. (Contact: 9848019297, E-mail: chennar@yahoo.com)

తరపున సిఆర్ బ్రాడ్‌కాస్టింగ్ హైదరాబాద్ లిమిటెడ్

ప్రదేశం : హైదరాబాద్
తేది : 31-10-2023

సం/- డి.సీతారామచంద్రరావు, డైరెక్టర్
డిఐఎన్ : 06571376

వర్షాభావంతో రాష్ట్రంలో కుదేలైన వ్యవసాయ రంగం

యుద్ధ ప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు విజ్ఞప్తి

విశాలాంధ్ర-రెడ్డిగూడెం: రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల నుంచి రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అనావృష్టి వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులను, వలసల నివారించాలనే డిమాండ్‌తో రాష్ట్రంలోని అన్ని గ్రామ సచివాలయాల ముందు ధర్నాలు నిర్వహించి, వినతిపత్రాలు సమర్పించాలని ఇచ్చిన పిలుపుననుసరించి ఎన్టీఆర్‌జిల్లా మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో ఈరోజు వ్యవసాయ కార్మికులు గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, గ్రామ సచివాలయం ఎదుట ధర్నా జరిపి గ్రామ కార్యదర్శి వెంపటి రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంత భయానకకరువు పరిస్థితులు ఏర్పడి రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలో గ్రామాలకు గ్రామగ్రామాలే ఖాళీ అవుతుంటే మన రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం స్పందన లేక పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమానికి సంఘం స్థానిక నాయకులు నమ్మిక శ్రీను, బి, చంటి, కేశవరెడ్డి, వెంపటి యేసు, చల్లా దాసు, కట్టా శ్రీను, బాలస్వామి, మోహనరావు, చిన్న జమలయ్య, తదితరులు నాయకత్వం వహించారు.

అభయ గోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి: డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: అభయ గోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని అభయ గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభయ గోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ సోమవారం అసోసియేషన్ అధ్వర్యంలో ఆర్.ఆర్.పేట స్ఫూర్తి భవన్ నుండి రామచంద్రరావు పేట,ఫైర్ స్టేషన్, జిల్లా పరిషత్ మీదుగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ... 2008లో విజయవాడ కేంద్రంగా కూకట్ల శ్రీనివాస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అభయ గోల్డ్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని స్థాపించి... తక్కువ కాలంలో ఎక్కువ మొత్తాన్ని పొందవచ్చునని విస్తృతంగా ప్రచారం చేసి ఖాతాదారుల నుండి రోజు, నెలవారీ డిపాజిట్లు ద్వారా రూ.174 కోట్లు సొమ్మును దోచుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో 10 జిల్లాలు, తెలంగాణలో 7 జిల్లాలతో పాటు అనేక బ్రాంచీలను ఏర్పాటు చేసి 4 లక్షల మంది ఖాతాదారుల వద్ద నిలువు దోపిడీ చేసి... 2013లో బోర్డు తిప్పేయడంతో డిపాజిట్లు చేసిన ఖాతాదారులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అభయ గోల్డ్ సంస్థ బాధితులకు న్యాయం చేసి వారి సొమ్ము చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని దేగల డిమాండ్ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర మాట్లాడుతూ అభయ గోల్డ్ ఏజెంట్లు, ఖాతాదారులంతా ఐక్యంగా అభయ గోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి వివిధ రూపాలలో ఆందోళన చేసి కేసులు పెట్టడంతో ప్రభుత్వం అభయ గోల్డ్ ఆస్తులు స్వాధీనం చేసుకున్నప్పటికీ... ఇప్పటికీ బాధితులకు పరిహారం అందలేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బాధితులకు అసలు, వడ్డీతో పూర్తి డిపాజిట్ల చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, తెర్లాపు శ్రీను, ఎంఏ హకీమ్, ఉప్పులూరి రవి, అబ్దుల్ రషీద్, కొల్లూరి సుధారాణి, జోజి మేరీ, భవానీ, లక్ష్మీ, షేక్ మీరా షరీఫ్, కోనా శ్రీనివాసరావు, విశ్వనాథం గోపీ, వెజ్జు నాగమణి, సోలాబత్తుల శ్రావణి, తేలప్రోలు రంగమ్మ, బరుసు ప్రభావతి, కోనా చంద్రావతి, మేరుగు చిన్నమ్మడు, మేకల రాధ, శానాపతి అరుణ, అరసవిల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

డబ్బు సంచులకు, ఎన్నికలకు ఉన్న విడదీయరాని సంబంధంవల్ల ధన ప్రభావం మన ఎన్నికలను అపహాస్యంపాలు చేస్తోందని కొత్తగా చెప్పక్కర్లేదు. డబ్బు సంచులు గుమ్మరించి ఎన్నికల్లో గెలవడం సరైన పని కాదని తెలిసినా రాజకీయ పార్టీలు, సామాన్యజనం సైతం ఎన్నికలలో ధన ప్రభావాన్ని అంతగా పట్టించుకున్నట్టు లేదు. ఇలాంటివన్నీ ఈ రోజుల్లో సర్వసాధారణం అని సరిపెట్టుకోవడం అలవర్చుకున్నట్టున్నారు. ఈ దుష్ప్రభావాన్ని దూరం చేస్తామన్న లక్ష్యంతో మోదీ ప్రభుత్వం 2017లో ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో ధన ప్రభావాన్ని నియంత్రించడమే ఈ బిల్లు లక్ష్యం, ఎన్నికలకోసం వివిధ వ్యాపార సంస్థలు, వ్యక్తులు రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చడంలో దాపరికంలేకుండా చేయడం అసలు ఉద్దేశమని మోదీ ప్రభుత్వం వాదిందించింది. ఇప్పటికీ వాదిస్తూనే ఉంది. ఎన్నికల బాండ్ల విధానాన్ని అమలు చేస్తామని అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017 బడ్జెట్ ప్రసంగంలో ప్రతిపాదించారు. 2018లో దీనికి సంబంధించిన ఉత్తర్వు వెలువడింది. ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశ పెట్టడంకోసం ఆర్థిక చట్టాన్ని, ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని సవరించవలసి వచ్చింది. కంపెనీల చట్టం, ఆదాయపు పన్ను శాఖ చట్టం, రిజర్వు బ్యాంకు చట్టం, విదేశీ నిధులు అందడాన్ని నియంత్రించే చట్టాన్నికూడా సవరించవలసి వచ్చింది. ఎన్నికల బాండ్లు ప్రవేశపెట్టడంవల్ల అక్రమంగా విరాళాలు ఇచ్చుకోవడం, పుచ్చుకోవడంలో దాపరికం లేకుండా పోతుందని అనుకుంటే ఈ ఆశకు పూర్తి విరుద్ధంగా రాజకీయ పార్టీలకు కార్పొరేట్‌సంస్థలు తమ పేర్లు బయటపెట్టకుండానే అపారంగా విరాళాలు ఇవ్వడానికి కొత్తవిధానం వీలు కల్పించింది. భారతీయులు, విదేశీయులుకూడా తమ పేరు బయటపెట్టవలసిన అవసరం లేకుండా నిధులు సమకూర్చడానికి అవకాశం కలిగింది. అంతకు ముందున్న చట్టాల్లో లొసుగులను సరిదిద్దబోయి వాటిని మరింత పెద్దవిచేసి నిధుల పేరుతో అక్రమ లావాదేవీలకు, పకడ్బందీ అయిన దాపరికం కొనసాగించడానికి ఈ బాండ్లు ఉపకరించాయి. ఈ బాండ్లవల్ల సమకూరే నిధుల్లో 85 శాతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకే దక్కుతున్నాయి. ఇది ముందే అనేక అసమానతలుఉన్న విధానాలను మరింతగా అసమానతలు కల్పించడానికి తోడ్పడింది. విదేశీ సంస్థలు కూడా అపరిమితంగా, పూర్తి దాపరికంతో నిధులు అందించడం మన ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పుగా తయారైంది. అందుకే ఈ బిల్లును సుప్రీంకోర్టులో సవాలు చేయవలసి వచ్చింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 29 సి సెక్షన్ ప్రకారం నిధులు సమకూర్చడం గురించి ఎన్నికల కమిషన్ కు విధిగా తెలియజేయాలన్న నియమమూ లేకుండా పోయింది. దీర్ఘకాలంవేచి ఉన్న తరవాత ఎన్నికల బాండ్లను సవాలుచేసే పిటిషన్ సుప్రీంకోర్టు విచారణకు చేపట్టింది. విచారణ మరికొన్ని రోజులు కొనసాగవచ్చు. ఈ పిటిషన్లను విచారిస్తున్న అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంతీర్పు ఎలా ఉంటుందో ఊహించడం సాధ్యం కాకపోవచ్చు. విచారణాక్రమంలో న్యాయమూర్తులుచేసే వ్యాఖ్యలు బోలెడు ఆశాభావాన్ని కలిగిస్తాయి కాని తీరా తీర్పువచ్చేసరికి ఆ ఆశలన్నీ చెదిరిపోయే సందర్భాలే అధికం. ఈ బాండ్ల ప్రస్తావన వచ్చిన వెంటనే ప్రజాస్వామ్య పరిరక్షణకోసం పాటుపడే ఎ.డి.ఆర్. అనే సంస్థతోపాటు అనేక పిటిషన్లు దాఖలైనాయి. ఎవరు ఏ పార్టీకి ఎన్నికల నిధులు సమకూరుస్తున్నారో తెలియజేయవలసిన అవసరం లేదు కనక కార్పొరేట్ సంస్థలు అడ్డదారుల్లో నిధులు అందించడానికి ద్వారాలు బార్లా తెరుచుకున్నాయి. విదేశీ కంపెనీలు ఇచ్చే నిధులకు కూడా ఎలాంటి పన్ను చెల్లించవలసిన అవసరంలేదు. విదేశీ కంపెనీలు మన దేశంలో పని చేస్తున్న ఆ కంపెనీల అనుబంధ సంస్థల ద్వారా నిరాఘాటంగా నిధులు అందజేయవచ్చు.

అటార్నీ జనరల్ వింత వాదన

సుప్రీంకోర్టులో విచారణ మొదలైన మాట నిజమే కాని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఈ బాండ్ల విధానాన్ని, అందులో గోప్యతను కొనసాగించడానికి అవకాశం మిగిలేఉంది. ఈ పిటిషన్‌పై సమగ్రమైన విచారణ ప్రారంభం కాకపోయినా 2019 ఏప్రిల్‌లో అత్యున్నత న్యాయస్థానం తమకు అందే విరాళాల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేయాలన్ని నియమం పెట్టింది. ఈ వివరాలన్నీ ఎన్నికల కమిషన్‌కు సీల్డు కవర్లో అందించాలని ఆదేశించింది. అక్టోబర్ 10న సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్న క్రమంలోనె ప్రసిద్ధ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, మరో న్యాయవాది షాదాన్ ఫరసత్ బాండ్లకు వ్యతిరేకంగా తమ వాదనలు గట్టిగా వినిపించారు. వివిధ స్థాయిల్లో విరాళాలు సమకూరుస్తున్నదెవరో గోప్యంగా ఉండడం ఈ విధానంలోని ప్రధానలోపం. ఎవరు ఎంతమొత్తం ఇచ్చారో కూడా తెలియదు. ఒక వ్యాపారసంస్థ కనక ఏదో రాజకీయపార్టీకి విరాళంఇస్తే ఆ కంపెనీ ఆ విరాళాలకు సంబంధించిన సమాచారాన్ని కడకు తమ కంపెనీలో వాటాదార్లకు కూడా చెప్పాల్సిన పనిలేదు. విచారణాక్రమంలో భారత అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ఈ విరాళాల వివరాలను తెలుసుకునే హక్కు ప్రజలకు లేదని, ఇది ప్రాథమిక హక్కేమీ కాదని తెగేసి వాదించారు. అంటే దాపరికతత్వాన్ని వదలడం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేదన్నమాట. ఈ అంశాన్ని కనక సుప్రీంకోర్టు పరిశీలించి తన నిర్ణయాన్ని ప్రకటించే స్థితి వస్తే అది ఎన్నికల బాండ్లు చట్ట సమ్మతమైనవో కాదో తేల్చడంతో ఆగిపోకుండా ప్రభుత్వ విధానాలలో కల్పించుకునే స్థాయికి చేరుతుందని వెంకటరమణి వాదిస్తున్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పూర్వాపరాలు తెలుసుకునే హక్కు ప్రజలకి ఉందని అత్యున్నత న్యాయస్థానం చెప్పినంత మాత్రాన ఏ రాజకీయ పార్టీకి ఎవరు, ఎంత మొత్తంలో విరాళాలు ఇచ్చారో కూడా తెలుసుకోవాలనుకోవడం వ్యక్తి స్వేచ్ఛను ఉల్లంఘించడమేనన్నది ప్రభుత్వ వాదనగా కొనసాగుతోంది. దాపరికానికి అవకాశం ఉండడంవల్ల దాపరికం మరింత పెరుగుతుంది. నల్ల డబ్బు ప్రవాహమూ ఇనుమడిస్తుంది. అవినీతీ మితిమీరుతుంది. తమ ప్రయోజనాలు నెరవేర్చే రాజకీయపార్టీలకు విరాళం ఇవ్వడంకోసం బూటకపు కంపెనీలూ పెరిగిపోతాయి. బినామీ లావాదేవీలు ఇష్టానుసారం సాగుతాయి. ఇలాంటి అంశాలనుబట్టి చూస్తే మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల విధానంలో ప్రభుత్వం చెప్తున్నట్టు దాపరికంలేకుండా చేయడంఅన్న హామీకి దిక్కేలేకుండా పోతుంది. ఈ బాండ్ల కోసం ఆర్థిక చట్టాన్ని సవరించడం, అందులోనూ ద్రవ్యబిల్లుగా చెలామణిచేసి పార్లమెంటు ఆమోదం పొందడంవల్ల ప్రభుత్వం పనిసులువు అయి ఉండొచ్చు. కానీ ఈ బాండ్లకోసం ఇంతకు ముందు కార్పొరేట్ సంస్థలు తమ లాభంలో 7.5 శాతం మించకుండా విరాళాలు ఇవ్వాలన్న ఆంక్ష కూడా తొలగిపోయింది. ఇది నిధులు సమకూర్చుకునే సత్తా ఉన్న పార్టీలకే మేలుచేస్తుంది తప్ప ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని నిరోధించదు. సుప్రీంకోర్టు తీర్పు ఈ లొసుగులన్నింటినీ సరిదిద్దడానికి తోడ్పడితే అంతకన్నా కావాల్సింది ఏమీ ఉండదు. ఏకపక్షంగా బిజేపీకి ప్రయోజనం కలిగేలా ఈ బిల్లు తీసుకొచ్చారు అన్న అభిప్రాయమూ తొలగి పోవాల్సిందే.

కరువు రక్కసి కాటేస్తుందేమో?

వి. శంకరయ్య

ఎన్ని జిమ్మికులు చేసినా 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో క్రమేణా ఆవరిస్తున్న కరవు రక్కసి కోరల నుండి తప్పించుకోలేదు గత మూడేళ్లుగా వర్షాలు సమృద్ధిగా పడుతుంటే వైసీపీ నేతలు ఇదంతా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి మహత్యమని డప్పు వాయించుకొన్నారు. అంత క్రితం నష్ట జాతకులు పరిపాలన సాగించినందున వర్షాలు సరిగా పడ లేదని ప్రచారం చేశారు. అయితే గత సంవత్సరమే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో కరువు ఛాయలు చుట్టుముట్టినా అదృష్ట జాతకుడు ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. వైసీపీ నేతలు మూగనోము పట్టారు. కాని ఈ ఏడు అసలు బండారం బయటపడింది. రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశ వ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో వర్షాలు సమృద్ధిగా పడలేదు. వర్షాలు కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో నైనా పడి వుంటే కృష్ణకి వరదలు వచ్చేవి. కాని భిన్నమైన పరిస్థితి నెలకొంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే భిన్నమైన వాతావరణ పరిస్థితుల వలన వర్షాభావ పరిస్థితులు వుంటాయనే కనీసజ్ఞానం ఇంతకాలం వైసీపీ నేతలకు లేకపోయింది. రాష్ట్రంలో ఈ సంవత్సరం రాష్ట్ర మొత్తంమీద వర్షాలు పడలేదు. తుదకు కృష్ణ డెల్టాలో వేసిన పంటలు ఎండిపోతుంటే వ్యవసాయానికి అప్పులుచేసి పెట్టిన పెట్టుబడులు ఏలా తీర్చాలనో అర్థం కాకుండా రైతులు అంగలార్చుతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో జరిగిన విధ్వంస రచన చూచి వరుణుడు కూడా రాష్ట్రం వేపు వచ్చేందుకు మనస్కరించక మొహం చాటేశాడేమోనని వచ్చే ఆరునెలల్లో ఈ దురాగతాలకు బ్రేక్ పడుతుందని ఎవరైనా కొంటె ప్రశ్న వేస్తే ఇన్నాళ్లూ పొగడ్తలతో కాలం గడిపిన వైసీపీ నేతలు ఏ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చేయవచ్చు. పోలీసులు కేసు నమోదుచేసి అరెస్టు చేయవచ్చేమో! ఇలాంటి వ్యూహాలు కనిపెట్టే బ్యాచ్ ముఖ్యమంత్రి చుట్టూ చాలమంది వున్నారు.

అధికారిక గణాంకాల మేరకే ఖరీఫ్‌లో 24 లక్షల ఎకరాల్లో సాగుబడి తగ్గింది. ఉద్యానవన పంటలకు నిలయమైన ప్రాంతాల్లో 18 లక్షల ఎకరాలు బీడు పోయాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 446 మండలాల్లో కరవుమేఘాలు దట్టంగా కమ్ముకొస్తున్నాయి. సాధారణంగా ఖరీఫ్ కాలం పూర్తయ్యే కాలానికి అక్టోబర్ ఆఖరుకు ప్రభుత్వం ఈ గణాంకాలు సేకరించి రాష్ట్రస్థాయిలో సమీక్ష పూర్తిచేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. అలాంటి సూచనలు ఏపీ రాష్ట్రంలో కనిపించడంలేదు. ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లోనే రానున్న కరువు గురించి వర్షాభావం బట్టి సమాచారం వెల్లడౌతుంది. ముఖ్యమంత్రి, మంత్రులు గాని తుదకు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కూడా కరువు గురించి పట్టించుకున్న దాఖలా లేదు. పప్పులు, బెల్లాలకు

సరిపోయే విధంగా ఓటర్లకు అడ్వాన్స్‌గాపంచే ఉచితాల గురించి ప్రచారం చేసుకోవడంతో సరిపెడుతున్నారు. రహదారులు గురించి ఇప్పుడు ముఖ్యమంత్రికి జ్ఞానోదయం అయింది. చైతన్య యాత్రలపేర వైసీపీ నేతలు బస్సు యాత్రలు మొదలు పెట్టగానే రాష్ట్రంలో రహదారులు ఎంత అధ్వానంగా వున్నాయో తెలిసొచ్చింది. అందుకోసమేనేమో వెంటనే రహదారులు మరమ్మతులు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. గడప గడప కార్యక్రమంలో పోలీసుల రక్షణ లేకుండా వైసీపీ నేతలు తిరిగి వుంటే రాష్ట్రం ఏ విధంగా రావణకాష్ఠం అయిందో ముఖ్యమంత్రికి తెలిసొచ్చేది. ఒక విధంగా ఈ పాటికే తుది ఘడియలు సమీపించాయి కాబట్టే ఇందుకు ప్రత్యామ్నాయంగా ప్రతిపక్షాలకు పడే ఓట్లు తొలగింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ప్రతిపక్షాల నేతలను ప్రజలమధ్య తిరగనీయకుండా అరెస్టులపర్వం అమలు చేస్తున్నారు. గత చరిత్రపుటలు తిరగేస్తే ఇందిరగాంధీ కాలంలో అత్యవసర పరిస్థితి తత్ఫలితంగా వచ్చిన అనుభవం గుర్తు వున్నట్లులేదు. కోస్తాజిల్లాల్లో పంటలు సాగుచేయకపోయినా (తరచూ క్రాఫ్ హాలిడే వుంటుంది) లేక కొంతమేర సాగుచేసిన పంటలు ఎండిపోయినా తట్టుకొని నిలబడ కలుగుతారు. రాష్ట్ర విభజన చట్టంలోనే వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించిన ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి ఘోరంగా వుంటుంది. మొదలే వ్యవసాయ కుంటుపడి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిలేకుండా వలసబాట పడుతుంటారు. మూలిగే నక్కపై తాడికాయ పడినట్లు పూర్తిగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున వ్యవసాయ కూలీలతో పాటు చిన్న, మధ్య తరగతి రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. పొలంపుట్ర లేనివారు రోజూ కూలికి వెళితేగాని పూట గడవనివారు ఉపాధి కోసం కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలసపోతారు. సుగ్గీ పోవడం వారి జీవితాల్లో భాగమైంది. వచ్చిన చిక్కల్లా సన్నకారు, మధ్య తరగతి రైతులదే. అందుకే ఆత్మాభిమానంతో ఆత్మహత్యలకు తలపడుతున్నారు. కొద్దోగొప్పో వుండే పొలంసాగుచేసి పంటలు ఎండిపోగా పెట్టుబడులకోసం చేసిన అప్పులు తీర్చలేక మరీ కౌలురైతులు మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్యలే శరణ్యమవుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ముున్ముందు ఎన్ని దుర్వార్తలు వినవలసి వుంటుందో. ఇప్పుడు దుర్భిక్ష పరిస్థితుల ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు జిల్లాలో కూడా ఏర్పడ్డాయని వార్తలు వస్తున్నాయి.

ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు ఉపాధికోసం పొట్టచేత పట్టుకొని కర్నాటక రాష్ట్ర వెళుతూ రోడ్డు ప్రమాదంలో పదిమందికి పైగా మృతిచెందిన తర్వాత కూడా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లులేదు. ఎక్స్‌గ్రేషియో ప్రకటించి చేతులు దులుపుకున్నారు. సమస్య మూలాలలోనికి వెళ్లడం లేదు. ఈ రోజు అనంతపురంజిల్లా వాసులకు కాలం చెల్లింది. మున్ముందు మరో జిల్లావాసులకు ఈ దుర్గతి ఎందుకు పట్టదు? కర్నాటక, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ప్రధానంగా కర్నూలుజిల్లా పశ్చిమప్రాంతంలో వలసలు ఎక్కువగా వుంటాయి. వలసపోతూ మధ్యలో ప్రమాదాలకులోనై కాలంచెల్లిన కుటుంబాల పిల్లలు ముదుసలుల గాథలు హృదయ విదారకంగా వుంటున్నాయి. వారిని ఆదుకొనేవారులేక రోజూ చనిపోతున్న విషాద గాథలు ఎన్నెన్నో. రాయలసీమలో ఈ దుర్గతి నెలకొనడానికి వైసీపీ ప్రభుత్వమే ప్రథమ ముద్దాయి. సాగునీటి రంగంలో భారీ ప్రాజెక్టులతోపాటు స్థానికంగా చిన్న చితక పథకాలు సాగుతుంటే వివిధ రకాలుగా ఉపాధి ఏర్పడుతుంది. శారీరక శ్రమచేసే కూలీలకు పనులు లభించడంతోపాటు ట్రాక్టర్ డ్రైవర్‌లు విద్యుత్ పనులతో పాటు వివిధ రకాల పనులు లభిస్తాయి. ఇలాంటి వారు ఇప్పుడు పనులులేకుండా తుదకు తోపుడు బండ్లపై చిన్న చితక పనులు చేసుకొంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జాగ్రత్తపడి మరీ దారుణంగా వుండే జిల్లాలను లేక మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి వుంటే ఉపాధి హామీకింద మరిన్ని పనులు చేసేందుకు అవకాశం వుండేది. వీరికే కాకుండా మధ్యతరగతి రైతులకు ఉపశమనం కలిగేది. బ్యాంకు రుణాలు కంతుల చెల్లింపు ఈ ఏడు వాయిదా పడటమే కాకుండా కొత్త అప్పులు పుట్టేవి. కరవు మండలాలుగా ప్రకటించడంవలన పలువిధాలుగా ఉపశమనం లభిస్తుంది. ఉపాధికోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే వలసలు కొంతమేరకైనా తగ్గేవి. చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులు ప్రైవేట్ వ్యక్తులవద్ద తెచ్చిన అప్పులకు ఉపశమనంతోపాటు బ్యాంకులనుండి రుణాలుపొంది చెల్లించేవారు. కాని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు లేవు.

విశ్రాంత పాత్రికేయులు 9848394013

చిలుకా పలుకవే!

-చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

కాలం చలికాలం కావడంవల్ల చార్జింగ్ అయిపోయిన సూర్యుడు రీచార్జయి రేపు ఉదయాన్న కానీ రాడని ఐదుగంటలకే చీకటి నల్లదుప్పటి తెచ్చి లోకాన్ని కప్పేయసాగింది. చీకట్లో రోడ్లంట తిరగడం అంత సేఫ్ కాదని పొద్దు గూట్లో పడుతుంటే కూలిన కొంప అరుగు మీదకి చేరుకుంది డాగీ. అప్పటికే గోడకు ఆనుకుని కునుకు తీస్తున్నది డాంకీ. ఏంటిది బ్రో అసుర సంధ్యవేళ నిద్దరమంచిది కాదంటారు గదా. ఇప్పుడే నిద్దరోతే ఏ రాత్రోలేచి సంగీత సాధనచేసి నిద్రా నిద్రాభంగం చేస్తావు, లే....లే... అంది డాగీ. నేనేం సిద్దరపోవడం లేదులే. ఒంటరిగా ఉన్నాను కదా ఏమీ తోచక కళ్ళు మూసుకున్నా నంతే అంది డాంకీ. అరుగు మీదికి ఎక్కిన డాగీకి సగం కూలిన గూట్లో ఏదో ప్రాణి కదలాడుతున్నట్టనిపించి అలవాటు ప్రకారం "భవ్వ" మంది. గూటిలో ఉన్న ప్రాణి ఒక్కసారి రెక్కలు టప టప లాడిస్తూ పై కెగిరి మళ్ళీ అదే గూట్లో కూచుంది. ఎవరోయ్ నువ్వు! మా కొంపలో దూరేవు అనుమతి లేకుండా అంది డాగీ. సారీ ఫ్రెండ్! చీకటి పడవస్తున్నది. కొంపా గోడు లేని దాన్ని ఈరాత్రి కిక్కడే వుండి రేపు ఉదయం ఏ చెట్టు మీదో గూడు కట్టుకుంటాను అంది రెక్కల పక్షి. మసక చీకటిలోనూ నీ ఒంటి మీద ఆకుపచ్చ రంగు కనిపిస్తున్నది. చిలకవా నువ్వు అంది డాగీ. అవును. గుర్తుపట్టావు గదా. ఎవరోయ్ కాదు ఎవరమ్మా నువ్వు అనాలి. సరే! చెప్పాల్సింది చెప్పా ఇక నీఇష్టం నీతోపాటు మరో ఆకారం ఉందే ఈ అరుగుమీద అంది చిలకమ్మ. అవును మై డియర్ ప్యారట్! నన్ను గాడిద అంటారు నీకేం భయంలేదు. నేను వెజిటేరియన్నే అంటే నేను నాన్ వెజ్జీనని భయపెడ్తున్నావా చిలకని. నా ఒక్క పంటి కిందికి రాదు యిది. ఏదో కడుపు నింపుకోడానికి మాంసం కొట్టు ముందు తచ్చాడుతాను కాని ఏది పడితే అది తినను. దయతలిచి మనుషులే ఏదైనా పెడితే తింటాను కాని, మనుషుల్లా అడ్డమైన గడ్డీ తినను అంది డాగీ. మన మధ్య మనుషులెందుకు. సృష్టిలో అందరి కంటే తెలివైన వాళ్లమని చెప్పుకుంటారుగాని వాళ్లంతా నీచులు, నికృష్టులూ ఉండరు అంది చిలక.

అదేంటి అలాగంటావు మనుషుల మీద ఎందుకింత కోపం నీకు అంది డాగీ. ఇంత కూడు పడేస్తే తోక ఊపుతూ విశ్వాసంగా వాళ్ల వెనక తిరుగుతావు నీకేం తెల్సువాళ్ల దుర్మార్గం. వాళ్లు ఒకళ్లని ఒకళ్లు అకారణంగా అవసరం లేకుండా చంపుకుంటారు. గాజాకు వెళితే తెలుస్తుంది. చంద్రుడిపైకి వెళ్లారు కానీ, పక్కన ఉన్న మనిషి ప్రాణం విలువ తెలీని వాళ్లు ఎంత జ్ఞానం ఉంటేఏం? పశువుల కంటే హీనం అంది డాంకీ. బాగా చెప్పావు నా సంగతే వినండి. ఎక్కడో చెట్టు కొమ్మల్లో ఉంటూ, హాయిగా, స్వేచ్ఛగా గాల్లో ఎగిరే నన్ను పట్టుకువచ్చి ఒకడు సిటీలో అమ్మేడు. కొన్నవాడు నన్ను బోనులో పెడితే ఊచలు లెక్కపెట్టడ ం తప్ప, రెక్కలు విప్పలేక పోయాను. నా ఇష్టం వచ్చిన పండ్లుకాక వాడు పెట్టినవి తినలేక గింజుకు చచ్చేదాన్ని అంది చిలక. నీకేం తక్కువ ఆకుపచ్చని గౌను, ఎర్రటి ముక్కు ఎక్కడికైనా ఎగిరి పోవడానికి రెక్కలు, నాలాగ బూడిద రంగు తోలు, డాగీలాగ మొరటు చర్మమూ లేవుకదా అంది డాగీ. ఇప్పుడు మన అందం సంగతెందుకులే మనుషుల్లా మార్చుకోడానికీ మనకు దుస్తులు లేవు, కండువాలు మార్చి మళ్లీ మళ్లీ చేరడానికి పార్టీలు లేవు. ఇంతకీ పంజరంలో ఉండాల్సిన దానివి ఇక్కడికి ఎలాగ వచ్చావు అంది డాగీ. స్వేచ్ఛ, స్వేచ్ఛ అని ఉపన్యాసాలిస్తారు మనుషులు మరి, మనకు వద్దా స్వేచ్ఛ. పంజరంలో చిక్కినవారు ఎప్పుడు బైటపడదామా అనే ఆలోచనేకదా అంది చిలక. అవును మనుషులు పదవుల కోసం ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి అక్కడ్నించి ఇక్కడికి జంపింగులు చెయ్యరూ. వాళ్లకు కావలసింది స్వేచ్ఛ కాదు ఏదో ఓ పదవి. దానికోసం బానిసల్లా బ్రతకడానికి సిద్ధపడతారు కన్నీళ్లు కారుస్తారు. కాళ్లు మొక్కుతారు. ఏమైనా చేస్తారు అవును డాగీ నువ్వన్నది నిజం నిజం అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. మనిషిని చూసి గూట్లో నుంచి పైకెగిరి కొంచెం ఎత్తులో గోడమీద కూచుంది చిలక. ఆరే! రామ చిలక! ఇక్కడికెలా వచ్చింది అన్నాడు అబ్బాయి. ఎలా వచ్చాను పంజరంలో నుంచి తప్పించుకువచ్చాను. అదృష్టం కలిసొచ్చింది గనక బెయిలూ, రిలీజూ, కోర్టు తీర్పూ లేకుండానే నాకునేనే వాడకుండా కట్టేసుకున్న రెక్కల్ని ఆడిస్తూ గాలిలో చక్కర్లు కొడుతూ వచ్చేశా! అలాగా ఇన్నాళ్లు ఎక్కడున్నావు అడిగింది డాగీ. అదిప్పుడు శివాజీ వీధి. నేను వెళ్లినప్పుడేదో పేరుండేది కాని ఈ మధ్యే మార్చేశారు. అవునా మనం ఉన్న ఈ వీధికి కూడా ఇదివరకు ఏదో పేరుండేది. కాని ఇప్పుడు దీన్ని వివేకానంద నగర్ అంటున్నారు. ఈ మైదానానికి రాం లీలా మైదాన్ అని పేరు పెట్టారు అన్నాడు అబ్బాయి. మనుషులు పార్టీలు మారవచ్చు, పార్టీలు పేర్లు మార్చుకోవచ్చుకాని ఊళ్ల పేర్లు, వీధి పేర్లు మార్చడం ఎందుకో అంది డాంకీ. ఇది చరిత్రలో ఉన్నదే. ఎవడు రాజైతే వాడి విగ్రహాలు, చిత్రపటాలు, వాడి పేరు ఢంకా బజాయించడం జరుగు తుంది. తర్వాత వచ్చినవాడు అవన్నీ ధ్వంసం చేసి తన రంగు, రుచీ, వాసనా చరిత్రలో కూరుతాడు. ఇంకొన్ని ఏళ్లయితే చరిత్రే చరిత్ర లేకుండా పోతుంది అన్నాడబ్బాయి. డాగీతోనూ, డాంకీతోనూ వాళ్ల భాషలో మాట్లాడుతున్న మనిషీ నీ భాష నాకూ అర్థం అవుతున్నది. నన్ను పంజరంలో పెట్టినవాడు నన్ను మనిషి భాషలో మాట్లాడమని తెగ సతాయించేవాడు. వాడుపెట్టే గింజలు, పండ్లముక్కలు పెట్టకపోతే చచ్చి ఊరుకుంటానని నేర్చుకున్నాను. ఇంటికి ఎవరైనా అతిథులువస్తే నా పంజరం దగ్గరికివచ్చి మా చిలక మాట్లాడుతుంది అని నా వైపుచూస్తే ఇండియా! ఇండియా! ఇండియా! అని చిలక పలుకులు పలికేదాన్ని ఈ మధ్య ఏ మొచ్చిందో వాడికి ఇండియా అనవద్దు అననే వద్దు భారత్! భారత్! భారత్ అంటావా లేదా అని చిన్నకర్రతో ముక్కుమీద పొడవసాగాడు. ఆబాధపడలేకే పారిపోయి వచ్చేశా అంది చిలక. ఒకరు దేశం పేరుని పార్టీ పేరుగా పెట్టుకుంటే, మరొకరు దేశం పేరునే మార్చేస్తారా? అ పేరుకూడా మరొకరు పార్టీపేరుగా వాడితే దేశానికి మరో పేరు వెదుక్కోవాలా అంటూ అరుగుదిగాడు అబ్బాయి. చరిత్రను ఎలాగూ మార్చేస్తున్నారు కదా ఇక పాత పుస్తకాలు నా ముందు పడెయ్యవచ్చు కదా అంది డాంకీ. పాపం! పేర్లు మార్చినప్పుడల్లా చిలుకలు కొత్తపేర్లు పలకాల్సిందేనా! అంది డాగీ. ఇండియా అనాలా? భారత్ అనాలా? ఇప్పుడేది పలకాలి అంది చిలక.

జర్నలిస్టులకు సంకెళ్లు

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

పత్రికాస్వేచ్ఛ వదలరాని విలువైన ప్రత్యేక హక్కని గాంధీ అన్నారు. పత్రికారంగం ప్రజాస్వామ్య నాల్గవ స్తంభం. మానవత్వ విలువల, సామాజిక బాధ్యతల, నైతిక పాత్రికేయత సమాజ నిర్మాణానికే మూలం. భారత జాతీయోద్యమంలో, స్వాతంత్ర్య సమరంలో, స్వేచ్ఛా సాధనలో, జాతీయ భావాల ప్రచారంలో, ఉద్యమాల నిర్మాణంలో, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజా సమీకరణ, ఐక్యతలలో, బలమైన ప్రజాభిప్రాయ నిర్మాణంలో పత్రికారంగం కీలకంగా కృషిచేసింది.

ఈస్ట్ ఇండియా కంపెని పాలనలో, బ్రిటిష్ రాణి ప్రత్యక్ష ఏలుబడిలో బ్రిటిష్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛపై అనేక పరిమితులు విధించింది. లండన్ నుండి ప్రచురించే పత్రికలు భారత స్వాతంత్ర్య పోరాట ఘటనలను వక్రీకరించాయి. స్వాతంత్ర్యం తర్వాత భారత రాజ్యాంగ అధికరణ 19, దాని ఉపాధికరణలు వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటన, పత్రికా స్వేచ్ఛలను అందించాయి. జాతీయోద్యమంలో పాత్రికేయకట్టడితో బాధలుపడిన భారత తొలిపాలకులు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించలేదు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పత్రికా స్వేచ్ఛను ప్రోత్సహించినట్లు, తనపై శంకర్స్ వీక్లీ విమర్శలను ఆహ్వానించినట్లు చరిత్ర చెపుతోంది. ప్రభుత్వ విధానాల విమర్శ వ్యక్తి విమర్శ కాదని, దిద్దుబాట్లకు అవకాశమిస్తుందని, దేశ నిర్మాణంలో అది అవసరమని నెహ్రూ ఉద్దేశం కావచ్చు. ఆర్.ఎస్.ఎస్. మతవాదయితే, తానూ మతవాదినేనని వితండీకరించిన సోషలిస్టు జయప్రకాశ్ నారాయణ్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైన్యాన్ని, పోలీసులను, ప్రజలను ఒక బహిరంగ సభలో రెచ్చగొట్టారు. రాజ్యాంగ అధికరణ 352(2) ప్రకారం ఇందిర అత్యయికస్థితిని రుద్దారు. 25.06.1975 నుండి 21.03.1977 వరకు 21 నెలలపాటు సాగిన అత్యవసరస్థితి కాలంలో పత్రికాస్వేచ్ఛను హరించారు. పాత్రికేయులను జైళ్ళలో పెట్టారు. కాని సమాజాన్ని మతపరంగా చీల్చలేదు. వైదికవాదులను ముస్లిం, క్రైస్తవులపై ఉసిగొల్పలేదు. ఆధిపత్య వర్ణాధికారంతో అల్పసంఖ్యాకులను పరాయీకరించలేదు. ప్రపంచీకరణలో ఉత్పత్తి రంగాలు, జాతి సంపదలతో పాటు సేవలనూ ప్రైవేటీకరించారు. ఈ నేపథ్యంలో పాత్రికేయ విధానంపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. వార్తాప్రసారం ప్రభుత్వాధికారంగా మారింది. వార్తా ప్రసార వ్యవస్థలు అందులో ప్రవేశించరాదన్న భావం ఉంది. అయినా నాటి ప్రభుత్వాలు క్రమం తప్పకుండా పత్రికా సమావేశాలను నిర్వహించేవి. నేటి పాలకులు అధికరణ 19 ని తుంగలో తొక్కారు. పత్రికా సమావేశాల ఊసేలేదు. సంఘీయులు, పాత్రికేయులను విదేశాల్లో కూడా అవమానించారు. దాడులు చేశారు. నిజాలను బయటపెట్టి, నిర్మొహమాటంగా ప్రశ్నించిన, దేశభక్త, సత్యశోధక, ప్రజా పాత్రికేయులు, నిర్వాహకులను పాలకులు "నేరపరిశోధన" సంస్థల దాడులకు గురిచేస్తున్నారు. తమను సమర్థించని పాత్రికేయుల కంప్యూటర్లను విచ్ఛిన్నం చేశారు. వాటిలో తప్పుడు సమాచారాలను ఎక్కించారు. దొంగ సాకులతో ప్రాథమిక సమాచార నివేదిక, విచారణలులేని, బెయిలు అవకాశం లేని, చట్టవ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం (ఉప) కింద వారిని నిర్బంధిస్తున్నారు. జైళ్ళలో కుక్కుతున్నారు. టెలిగ్రాఫ్ ఆంగ్ల దినపత్రిక సంపాదకుడు ఆర్.రాజగోపాల్, అంతర్జాల పత్రికలు వైర్ సంపాదకులు సిద్ధార్థ వరదరాజన్, న్యూస్ క్లిక్ సంపాదకులు ప్రబీరు పురకాయస్థ, నిర్వాహకులు ముకేశ్ చక్రవర్తి మొదలగువారు ఈ జాబితాలో ఉన్నారు. అస్మత్ పాత్రికేయులకు అనుచిత ప్రయోజనాలు కల్పిస్తున్నారు. రిపబ్లికన్ టివి

సంపాదకులు అర్ణబ్ రంజన్ గోస్వామి వీరిలో ప్రముఖులు. న్యాయస్థానాలు కూడా పాత్రికేయుల ప్రభుత్వ అనుబంధాన్నిబట్టి బెయిల్ నిర్ణయం తీసుకుంటున్నాయి. అభ్యంతర పెట్టలేదు. పాత్రికేయులకు న్యాయం చేయడం న్యాయస్థానాల బాధ్యతన్నారు. బెయిల్ ఇచ్చి, ఆ తీర్పు ప్రతి అందినంతవరకు ఆగవద్దని, అంతర్జాల ప్రతిపైనే చర్య తీసుకొమ్మని ఆదేశించారు.

ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో 19 ఏళ్ల దళిత బాలిక అగ్రవర్ణ ముఠా సామూహిక అత్యాచార హత్యకు గురయ్యారు. ఆ సమాచార సేకరణకు వెళుతున్న కేరళవాసి, ఢిల్లీ పాత్రికేయుడు సిద్దిక్ కప్పన్‌ను ఉపా చట్టం కింద అక్టోబర్, 2020లో అరెస్టుచేసి మథుర జైల్లో పెట్టారు. జైల్లో ఆయనకు కోవిడ్ సోకినా బెయిల్ ఇవ్వలేదు. రెండేళ్ళ తర్వాత బెయిల్ ఇచ్చినా మరొక కేసులో జైల్లోనే ఉంచారు. 23.12.2022న అలహాబాద్ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఇద్దరు స్థానికుల రూ.లక్ష హామీ షరతు విధించింది. కేరళీయ, ఢిల్లీ పాత్రికేయునికి స్థానిక నగదు పూచీకత్తు సాధ్యమా? ఈ రోజు 72శాతం పత్రికలు, టివిలు న్యూస్-18 పేరుతో ముకేశ్ అంబానీవే. పత్రికా రంగంలో సంచలన మార్పులు తెచ్చిన రామోజీరావు దినపత్రికలు, టివిలు (ఈనాడు తెలుగు దినపత్రిక, ఈటివి తెలుగు తప్ప) ముకేశ్ అంబాని సొంతం. కోల్‌కత పాత్రికేయురాలు రాధిక రాయ్, ఆమె భర్త ఆర్థిక నిపుణులు ప్రణయ్ రాయ్ 1984లో 24 గంటల ప్రసార స్వతంత్ర న్యూ ఢిల్లీ టివి (ఎన్డీటీవి)ని స్థాపించారు. వార్తా ప్రసారాలపై ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని తెంచారు. నిష్పక్షపాత వార్తలను అందించారు. ప్రధాని మోదీ ఎన్డీటీవికి ప్రకటనలు ఆపుచేయించారు. వ్యాజ్య వ్యూహం పన్నారు. వారి పత్రికా స్వేచ్ఛపై దాడి చేశారు. 2022 ఆగస్టులో బహుళజాతి సంస్థ యజమాని మోదీ మిత్రుడు గౌతం అదాని ఎన్డీ టివిలో 29.18శాతం వాటాను కబ్జా చేశారు. నవంబర్ లో మరో 8శాతం వాటాను కొన్నారు. డిసెంబర్‌లో రాయ్ దంపతుల నుండి 27.53శాతం వాటాను మాయాజాలంతో సంపాదించారు. దీంతో ఎన్డీటీవిలో అదాని వాటా 64.71కి ఎదిగింది. మోదీ అనుకూల, ప్రజానుకూల పాత్రికేయత మూతపడింది. పత్రికల సంపాదక ప్రమాణాల పెంపుకు, పత్రికా స్వేచ్ఛ రక్షణకు స్థాపించిన స్వతంత్ర సంస్థ భారత ఎడిటర్స్ గిల్డ్‌కు మౌనమే మిగిలింది. దేశంలో ప్రతి రాజకీయ పార్టీకి దినపత్రికలు, టివి ఛానళ్ళున్నాయి. 2021 ఫిబ్రవరికి 900 అనుమతించిన ప్రైవేట్ ఉపగ్రహ ఛానళ్ళున్నాయి. ఇవి తమ యాజమాన్య కార్పొరేట్ సంస్థలకు, తమకు వాణిజ్య ప్రకటనలిచ్చిన సంస్థలకు, కార్పొరేట్ అనుబంధ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తాయి.

ప్రజాస్వామ్యానికి, సమాజానికి ప్రజలు ఐదవ స్తంభం. ఈ రోజు ప్రజలు మతాధారంగా చీలిపోయారు. పాలకులు మెజారిటీ మతస్తులకు మతోన్మాదాన్ని ఎక్కించారు. వారి మెదళ్ళను అబద్ధాలతో, చారిత్రక వక్రీకరణలతో నింపారు. ఈ పనిలో పాలకవర్గ దళారి సంస్థల ధృతరాష్ట్ర విశ్వవిద్యాలయం(వాట్సాప్‌లు) ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు పురుషుల క్రికెట్, నేరాలు, చలనచిత్ర ప్రముఖులు, రాజకీయులు పత్రికారంగ ప్రధాన అంశాలు. సామాన్యులకు, స్త్రీలకు, సామాజికంగా వెనక్కునెట్టబడ్డవారికి స్థానంలేదు. నేటి పాలకులు రానున్న ఎన్నికల్లో కూడా నెగ్గితే ప్రజా పాత్రికేయతకే కాదు, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, పేద ప్రజా బాహుళ్యానికి ముప్పు. సమాజ మార్పుకు పత్రికారంగం తక్షణ స్వల్పకాలిక ఆయుధం. సత్యసేకరణ, వాస్తవ నివేదిక పాత్రికేయతకు ప్రధానం. పాత్రికేయతనూ, పాత్రికేయులనూ నేటి పాలకులు చీల్చారు. ప్రభుత్వపక్ష పాత్రికేయులను ప్రయోజనాలతో ప్రోత్సహిస్తున్నారు. ప్రజాపాత్రికేయుల మీద ఊహించని రీతుల్లో విపరీతమైన వత్తిడి పెంచారు. స్వేచ్ఛగా నిజాలు రాయడానికి, పాలకపక్ష ప్రజాస్వామ్య, రాజ్యాంగ, ప్రజావ్యతిరేక విధానాలను, భావజాల, సాంస్కృతిక దుర్మార్గాలను ప్రస్తావించడానికి అనేకులు జంకుతున్నారు. జనసామాన్యానికి అవసరమైన ప్రజా పాత్రికేయులను కాపాడు కోవలసిన బాధ్యత ప్రజాస్వామ్య వాదులందరిది. రాజ్యాంగమిచ్చిన పాత్రికేయ రక్షణకు ప్రజా సంఘాలు, పౌర హక్కుల వేదికలు, ప్రత్యామ్నాయ పార్టీలు కూడా పోరాడాలి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
సంచారవాణి : 94902 04545

కూటమి పార్టీలతో కాంగ్రెస్‌లో గుబులు

- మధ్యప్రదేశ్‌లో విడివిడిగా బరిలో 'ఇండియా' పార్టీలు
- 92 స్థానాల్లో ఎస్పీ, జేడీయూ, ఆప్ పోటీ

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. అధికారాన్ని నిలబెట్టుకొనేందుకు బీజేపీ తీవ్రంగా శ్రమిస్తుండగా ఈసారైనా గెలిచి అధికారాన్ని తిరిగి అందుకోవాలని సర్వశక్తులు ఒడ్డుతున్న కాంగ్రెస్‌కు కూటమి పార్టీలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. 'ఇండియా' కూటమిలోని తన మిత్రపక్షాల నుంచే కాంగ్రెస్ పార్టీ ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ ఏకపక్షంగా అభ్యర్థుల్ని ప్రకటించడాన్ని తీవ్రంగా విభేదించిన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తమ అభ్యర్థుల్ని బరిలోకి దించింది. జాతీయ స్థాయిలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏర్పాటైన 'ఇండియా' కూటమిలోని కీలక పార్టీలైన ఎస్పీతో పాటు ఆప్, జేడీయూ సైతం ఇక్కడ అభ్యర్థుల్ని పోటీలో నిలపడంతో కాంగ్రెస్ విజయావకాశాలకు గండి కొట్టే ముప్పు కనబడుతోంది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య నువ్వానేనా అన్నట్టుగా సాగే ఈ ద్విముఖ పోరులో ఎస్పీ, ఆప్, జేడీయూ నుంచి 90మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉండటంతో కాంగ్రెస్ గెలుపు ఆశలపై నీళ్లు చల్లే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తమకు ఒక్క స్థానం కూడా కేటాయించకుండా కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరించిందని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 నియోజక వర్గాలు ఉండగా.. కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ. అయితే, ఎస్పీ, ఆప్, జేడీయూ పోటీలో ఉన్న 92 స్థానాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అతి స్వల్ప తేడాతో గెలిచిన, ఓడిన స్థానాలు అనేకం ఉండటం కాంగ్రెస్‌కు గుబులుపుట్టిస్తోంది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ 92 స్థానాల్లో 15 చోట్ల స్వల్ప మెజార్టీతో గట్టెక్కగా.. ఆరు చోట్ల స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైంది. వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు మూడుసార్లు సమావేశాలు నిర్వహించడంతో పాటు, సమన్వయ కమిటీని సైతం ఏర్పాటు చేసుకున్నారు. అయితే, లోక్‌సభ సమరానికి సెమీ ఫైనల్స్‌గా భావించే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేసే అంశంపైనా గతంలో కొంత మేర చర్చలు జరిగినా అది పూర్తిగా కార్యరూపం దాల్చలేదు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ 'ఇండియా' కూటమి కలిసి పోటీ చేయాలా? వద్దా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సీట్ల సర్దుబాటు కేవలం లోక్‌సభ ఎన్నికల వరకేనని కాంగ్రెస్ చెబుతుండగా ఏ ఎన్నికల్లోనైనా బీజేపీని కలిసికట్టుగా ఓడించడమే లక్ష్యమని మరికొన్ని పార్టీలు అభిప్రాయపడుతున్నాయి.

రాజస్థాన్‌లో కొత్త పరిణామం

కలవరంలో బీజేపీ, కాంగ్రెస్

జైపూర్: రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరిగిన కీలక పరిణామం అధికార కాంగ్రెస్‌ను, అంతకంటే ఎక్కువగా విపక్ష బీజేపీని కలవరపెడుతోంది. రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఉన్న జాట్లు, దళితుల పేరిట రెండు పార్టీలు ఎన్నికల బరిలో దిగాయి. కనీసం 40 అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలను ప్రభావితం చేయగల ఈ రెండు సామాజికవర్గాలను అవి ఆకట్టుకుంటే ప్రధాన పార్టీలకు తీవ్ర నష్టం తప్పదన్న అభిప్రాయం వినిపిస్తోంది. వీటి జంట పోటీ ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీలకు చేటు చేయవచ్చంటున్నారు. ముఖ్యంగా బీజేపీకి ఎక్కువ నష్టం జరిగేలా కనిపిస్తోంది. రాజస్థాన్ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగుతున్నట్టు ప్రముఖ జాట్ నేత, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ నేత హనుమాన్ బెనీవాల్ ప్రకటించారు. అంతేగాక 10 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను కూడా ఇప్పటికే ప్రటించారాయన. మిగతా అన్ని స్థానాల్లో కూడా పోటీ చేయడం ఖాయమని స్పష్టం చేశారు. యూపీలో చెప్పుకోదగ్గ ఆదరణ ఉన్న దళిత నేత, భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ కూడా ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరాం) పేరుతో రాష్ట్రంలో తొలిసారి బరిలో దిగుతున్నారు. ఈ రెండు పార్టీలూ ఎన్నికల పొత్తు కుదుర్చుకుని రాజస్తాన్ బ్యాలెట్ పోరును మరింత ఆసక్తికరంగా మార్చేశాయి. రాజస్తాన్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లకు బలమైన ప్రత్యామ్నాయం రావాల్సిన అవసరం చాలా ఉందని ఈ సందర్భంగా బెనీవాల్, ఆజాద్ సంయుక్త విలేకరుల సమావేశంలో చెప్పుకొచ్చారు. ఇందుకోసం 'కిసాన్, జవాన్, దళిత్'వర్గాలు కలిసి రావాలంటూ వారిచ్చిన పిలుపు వెనక లోతైన అర్థమే దాగుంది. ఈ నయా జాట్-దళిత బంధం కాంగ్రెస్, బీజేపీ అవకాశాలను బాగానే దెబ్బ తీసేలా కనిపిస్తోంది.

పుల్వామాలో వలస కూలీపై కాల్పులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో స్థానికేతరుడిపై సోమవారం ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. తుపాకీ గాయాలతో ఆ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఉత్తర్ ప్రదేశ్ నుంచి వచ్చిన వలసకూలీ అని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు జరుగుతోందని చెప్పారు.'పుల్వామాలోని నౌపోరా ప్రాంతంలో ఒక వలసకూలీపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. తూటా గాయాలతో ఆ కూలి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముకేశ్‌గా గుర్తించాం' అని పోలీసులు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో 24 గంటల వ్యవధిలో జరిగిన రెండో ఘటన ఇది. ఆదివారం కూడా ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. శ్రీనగర్‌లోని ఈద్గా మైదానంలో క్రికెట్ ఆడుతున్న జమ్మూకశ్మీర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వనీపై ఒక ఉగ్రవాది కాల్పులు జరిపి పారిపోయాడు. ఇన్‌స్పెక్టర్ జట్టులోని ఇతర సభ్యులు ఆ ఉగ్రవాదిని పట్టుకునేందుకు ప్రయత్నించిప్పుడు గాలిలో కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురిచేశాడు. ప్రస్తుతం ఆ ఇన్‌స్పెక్టర్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు తామే పాల్పడినట్లు పాక్‌కు చెందిన లష్కరే తోయిబా అనుబంధ సంస్థ- 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రకటించింది.

రాజస్థాన్‌లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 25న జరగనుండగా... అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. నామినేషన్ పత్రాల సమర్పణకు నవంబర్ 6 చివరి తేదీ. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సిఫార్సు మేరకు గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా అనుమతితో ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విడుదల చేశారు. నామినేషన్ పత్రాల దాఖలు ప్రక్రియకు నవంబర్ 5న సెలవు. నవంబర్ 7వ తేదీన సంబంధిత పత్రాల పరిశీలన పూర్తి చేస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 9 చివరి తేదీ. రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 25 న ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈవీఎంల ద్వారా ఒకే దశలో నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్ పత్రాలను స్వీకరిస్తారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ప్రవీణ్ గుప్తా తెలిపారు. నామినేషన్ దాఖలు ప్రక్రియలో ఈసీఐ మార్గదర్శకాలకు పూర్తిగా కట్టుబడి ఉండేలా చూడాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులను సీఈఓ ఆదేశించారు. నామినేషన్ల సమయంలో ఆర్‌ఓలు సంబంధిత కార్యాలయాల్లోనే ఉండాలని, ప్రక్రియను సరిగ్గా వీడియోగ్రాఫ్ చేయాలని ఆయన చెప్పారు. ఏ అభ్యర్థి అయినా ఒకే నియోజకవర్గంలో నాలుగు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. గరిష్ఠంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయవచ్చు.

డిసెంబరు 31లోగా తేల్చండి

మహా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై స్పీకర్‌కు సుప్రీం ఆదేశాలు



ముంబై: మహారాష్ట్రలో శివసేన వర్గాలకు చెందిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై డిసెంబరు 31లోపు నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ రాహుల్ నార్వేకర్‌ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. రెండు వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పరస్పరం దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై డిసెంబరు 31 లేదా, అంతకుముందే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ గౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చాటిచెప్పింది. అనర్హత పిటిషన్లను ఆలస్యం చేయడానికి, విధానపర వివాదాల్లో చిక్కుకుపోవడాన్ని అనుమతించకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 'పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు రూపొందించిన పదో షెడ్యూల్ గౌరవాన్ని కాపాడాలని మేం కోరుకుంటున్నాం. లేనిపక్షంలో ఆ నిబంధనలను మనం గాలికి వదిలేస్తున్నట్లే'నని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ క్రమంలోనే డిసెంబర్ 31 నాటికి అనర్హత పిటిషన్లపై తుది ఆదేశాలు జారీ చేయాలని స్పీకర్‌ను ఆదేశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. అజిత్ పవార్ సహా తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఎన్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను వచ్చే ఏడాది జనవరి 31లోగా తేల్చాలని చెప్పింది. సీఎం ఏక్‌నాథ్ షిండే సహా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేసిన స్పీకర్‌పై సుప్రీం కోర్టు గత నెలలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్ల పరిష్కారానికి నిర్ణీత షెడ్యూల్‌ను ఖరారు చేయాలని సెప్టెంబరు 18న ఆదేశించింది. ఈ నెల 17న మరోసారి విచారణ చేపట్టింది. తమ ఆదేశాలను స్పీకర్ ధిక్కరించలేరని స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లను ఎప్పటికల్లా పరిష్కరిస్తారో తెలిపేందుకు స్పీకర్‌కు తుది అవకాశమిస్తూ విచారణను అక్టోబరు 30వ తేదీకి వాయిదా వేసింది. నేడు మరోసారి విచారణ చేపట్టి డిసెంబర్ 31 నాటికి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

ఎస్‌హెచ్‌జీలకు రుణ మాఫీ చేస్తాం

చత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంక గాంధీ

జలబంధ : స్వయం సహాయక సంఘాల రుణాల మాఫీ, కొత్త పథకం కింద సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్లు, రోడ్డు ప్రమాదాల బాధితులకు ఉచిత వైద్య చికిత్స వంటి అనేక ఎన్నికల హామీలను కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారాన్ని నిలబెట్టుకుంది. ఖైరాగఢ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని జలబంధ వద్ద ర్యాలీని ఉద్దేశించి ప్రియాంక మాట్లాడుతూ దాదాపు 6 వేల ప్రభుత్వ హయ్యర్ సెకండరీ, హైస్కూళ్లను స్వామి ఆత్మానంద ఇంగ్లీష్, హిందీ మీడియం పాఠశాలలుగా నవీకరణ చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును కూడా ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. అలాగే, కాంగ్రెస్ మహిళల కోసం గ్యాస్ సిలిండర్‌కు రూ500 సబ్సిడీని అందించడానికి మహతారీ న్యాయ్ యోజనను ప్రారంభిస్తుందని, స్వయం సహాయక సంఘాల రుణాలు, సక్షం యోజన కింద మహిళలు పొందే రుణాలను మాఫీ చేస్తామని ప్రియాంక చెప్పారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర ఆకస్మిక ప్రమాదాల బాధితులకు ముఖ్యమంత్రి ప్రత్యేక ఆరోగ్య సహాయ పథకం కింద ఉచిత వైద్యం అందిస్తామన్నారు. 'తివర (ఒక రకమైన కందులు) రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తాము' అని అన్నారు. బీజేపీని విమర్శిస్తూ, 'మతం పేరుతో మిమ్మల్ని తప్పుదోవ పట్టించి, మీ జీవితాల్లో సమస్యలు తెచ్చే వారికి ఓటేస్తారా, లేదా మీ అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే పార్టీకి ఓటేస్తారా' అని ఆమె సభికులను ఉద్దేశించి ప్రశ్నించారు.

దేశంలో వేగంగా అభివృద్ధి: మోదీ

మెహ్సానా: దేశంలో వేగంగా అభివృద్ధి కనిపిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా భారత్‌పై ప్రశంసలు కురుస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈ ఘనత సుస్థిర ప్రభుత్వాన్ని అందించిన ప్రజలకే దక్కుతుందని తెలిపారు. గుజరాత్‌లోని మెహసానా జిల్లా ఖేరాలులో 5,950 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. సుదీర్ఘకాలం కొనసాగిన సుస్థిర ప్రభుత్వం ఒకదాని తర్వాత మరొకటి నిర్ణయం తీసుకోవడంలో రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చేలా ఎలా సహాయపడిందో గుజరాత్ అనుభవించిందని మోదీ అన్నారు. తాను చేసిన వాగ్దానం చేస్తే దానిని నెరవేరుస్తానని కూడా ప్రధాని చెప్పారు. 'గుజరాత్‌లో సుస్థిరమైన, మెజారిటీ ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగడం... ఒకదాని తర్వాత మరొక నిర్ణయం తీసుకోవడంలో ఎలా సహాయపడిందో మాకు అనుభవంలోకి వచ్చింది' అని మోదీ అన్నారు. గత కొన్నేళ్లుగా భారీ ప్రాజెక్టులు చేపట్టడం, సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం, గుజరాత్ వేగంగా అభివృద్ధి చెందడం వెనుక బలమైన స్తంభాలు ఉన్నాయని ప్రజలకు బాగా తెలుసునని ఆయన అన్నారు. 'మీరు నన్ను ప్రధానమంత్రిగా కాకుండా మీ సొంత నరేంద్రభాయ్‌గా చూస్తారు. మీ నరేంద్రభాయ్ ఏంటో మీకు తెలుసు...అతను ఒకసారి ప్రతిజ్ఞ చేస్తే దానిని నెరవేరుస్తాడు' అని మోదీ అన్నారు.

కేరళ వరుసపేలుళ్ల ఘటన

బాలిక మృతి... మూడుకు చేరిన మరణాలు

ఎర్నాకుళం: కేరళలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వరుస బాంబు పేలుళ్ల ఘటనలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 12 ఏళ్ల బాలిక సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. దీనితో ఈ ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. ప్రాణాలు కోల్పోయిన బాలిక మలయత్తూర్‌కు చెందిన లిబినాగా అధికారులు గుర్తించారు. కలమసేరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. 95 శాతం తీవ్రంగా కాలిన గాయాలతో బాలిక ఆదివారం ఉదయం ఆసుపత్రిలో చేరిందని చెప్పారు. వెంటిలేటర్‌పై చికిత్స అందించినప్పటికీ బాలిక పరిస్థితి క్షీణించడంతో ఆదివారం అర్ధరాత్రి 12.40 గంటల ప్రాంతంలో మరణించినట్లు ఆసుపత్రి మెడికల్ బోర్డు వెల్లడించింది.

ఎర్నాకుళం జిల్లా కలమస్సేరి లోని 'జెహోవా విట్‌నెసెస్' అనే క్రైస్తవ మత గ్రూపు ప్రజలు సమావేశమైన జమ్రా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం వరుస బాంబు పేలుళ్లు కలకలం రేపిన విషయం తెలిసిందే. కన్వెన్షన్ హాలులో ప్రార్థనలు ప్రారంభమైన తర్వాత నిమిషాల వ్యవధిలో మూడుసార్లు పేలుళ్లు జరిగాయి. టిఫిన్ బాక్స్‌లో అమర్చిన ఐఈడీ పదార్థంతో పేలుళ్లు జరిపినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ పేలుడులో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మరణించగా.. మరో 51 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఎక్కువ ఒత్తిడికి గురవ్వద్దు

గుండెపోటు మరణాలపై కేంద్ర ఆరోగ్య మంత్రి

అహ్మదాబాద్: కరోనా సోకి తీవ్ర అనారోగ్యానికి గురై కోలుకున్నవారు తర్వాత ఒకటి నుంచి రెండేళ్లపాటు ఎక్కువగా శ్రమించకపోవడం మంచిదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. దీనివల్ల కార్డియాక్ అరెస్ట్ ముప్పు నుంచి బయటపడొచ్చని సూచించారు. ఇందుకు సంబంధించి భారత వైద్య పరిశోధన మండలి అధ్యయనాన్ని ఆయన ఉదహరించారు. ఇటీవలి కాలంలో గుండెపోటుతో అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన రేపుతున్న నేపథ్యంలో గుండెపోటుతో సంభవిస్తున్న మరణాలపై మాండవీయ పై విధంగా స్పందించారు. కొద్దిరోజుల క్రితం గుజరాత్‌లో దసరా పండగ సందర్భంగా గర్బా నృత్యం చేస్తూ పది మందికి పైగా మృతి చెందారు. ఈ మరణాలపై గుజరాత్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రుషికేశ్ పటేల్ వైద్య నిపుణులు, కార్డియాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాండవీయ కూడా పాల్గొన్నారు. "ఐసీఎమ్ఆర్ దీనిపై సమగ్ర అధ్యయనం నిర్వహించింది. వారి నివేదిక ప్రకారం కోవిడ్-19 కారణంగా తీవ్రంగా బాధపడిన వారు గుండెపోటు బారిన పడకుండా ఉండాలంటే కోలుకున్న తర్వాత రెండేళ్లపాటు ఒత్తిడితో కూడిన పనులు, పరిగెత్తడం, కఠినమైన వ్యాయామాలకు దూరంగా ఉండాలి" అని మంత్రి సూచించారు. గుజరాత్‌లో నవరాత్రుల సందర్భంగా గర్బా నృత్యం చేస్తూ ఖేడా జిల్లాలోని కపద్వంజ్‌లో 17 ఏళ్ల యువకుడు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. ఆ యువకుడిని ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు చెప్పారు. ఇదే తరహా ఘటనలు అహ్మదాబాద్, నవ్సారి, రాజ్‌కోట్‌లలోనూ చోటుచేసుకున్నాయి. వడోదర జిల్లాలోని దభోయిలో 13 ఏళ్ల బాలుడు, 28 ఏళ్ల యువకుడు, 55 ఏళ్ల వ్యక్తి గర్బా నృత్యం చేస్తూ గుండెపోటుతో మృతిచెందినట్లు వార్తలొచ్చాయి.

యూపీలో ఎన్‌కౌంటర్...

విద్యార్థిని మృతికి కారకుడైన నేరస్థుడి మృతి

లక్నో/ఘజియాబాద్: మొబైల్ దొంగతనం చేసే క్రమంలో బీటెక్ విద్యార్థిని కీర్తి సింగ్ మృతికి కారణమైన రెండో నిందితుడు తాజాగా పోలీసుల ఎన్‌కౌంటర్ లో చనిపోయాడు. ఉత్తరప్రదేశ్ లోని మసూరీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. యూపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఘజియాబాద్ లో ఈ నెల 27న ఇద్దరు మొబైల్ స్నాచర్లు దారుణానికి పాల్పడ్డారు. ఆటోలో వెళుతున్న బీటెక్ స్టూడెంట్ కీర్తి సింగ్ ను బైక్ పై వెంబడించి మొబైల్ ను లాక్కున్నారు. కీర్తి ప్రతిఘటించడంతో ఆమె చేయి పట్టుకుని కిందకి లాగారు, ఆపై కొద్దిదూరం రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. తర్వాత ఆమె మొబైల్ లాక్కుని పారిపోయారు. కదులుతున్న ఆటో నుంచి కిందపడడంతో తీవ్ర గాయాలపాలైన కీర్తిని ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ చనిపోయింది.

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మొబైల్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగలను గుర్తించిన పోలీసులు... వారికోసం వేట ప్రారంభించారు. ఒక నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపించగా... రెండో నిందితుడు జితూ (జితేంద్ర) కోసం రాష్ట్రవ్యాప్తంగా గాలించారు. ఈ క్రమంలో మసూరీ పోలీస్ స్టేషన్ పరిధిలో జితూ ఉన్నాడనే సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నంలో జితూ గంగానాహర్ ట్రాక్ పై పరుగులు పెట్టాడు. పోలీసులపై దాడికి ప్రయత్నించగా... పోలీసులు కాల్పులు జరపడంతో జితూ గాయపడ్డాడు. ఆ తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతను చనిపోయాడని పోలీసులు తెలిపారు. జితేంద్రపై ఇప్పటికే 12 కేసులు నమోదయ్యాయి. అతడిపై రూ.25వేల రివార్డు ప్రకటించినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆ హక్కు ప్రజలకు లేదు

రాజకీయ పార్టీల విరాళాలపై సుప్రీం కోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల నిధుల మూలాన్ని తెలుసుకునే ప్రాథమిక హక్కును రాజ్యాంగం పౌరులకు కల్పించలేదని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఆదివారం అన్నారు. పార్టీలకు రాజకీయ నిధుల కోసం ఎన్నికల బాండ్ల పథకం స్వచ్ఛ నగదుకు దోహదపడుతుందని సుప్రీం కోర్టుకు తెలిపారు. 'నిధుల మూలానికి సంబంధించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం పౌరులకు సమాచార హక్కు లేదు. సహేతుకమైన పరిమితులకు లోబడి లేకుండా 'ఏదైనా, ప్రతిదీ' తెలుసుకునే సాధారణ హక్కు ఉండదు' అని అత్యున్నత న్యాయస్థానం ముందు దాఖలు చేసిన ఒక ప్రకటనలో వెంకటరమణి అన్నారు. 'సందేహాస్పద పథకం గోప్యత ప్రయోజనాన్ని సహకారికి విస్తరిస్తుంది. ఇది స్వచ్ఛమైన డబ్బును అందించడాన్ని నిర్ధారించడంతో పాటు ప్రోత్సహిస్తుంది. అలాగే, ఇది పన్ను బాధ్యతలకు కట్టుబడి ఉండేలా చేస్తుంది. అందువల్ల, ఇది ప్రస్తుతం ఉన్న ఏ హక్కుకు భంగం కలిగించదు' అని ఏజీ సుప్రీం కోర్టుకు తెలిపారు. న్యాయ సమీక్ష అధికారం మెరుగైన లేదా భిన్నమైన ఆదేశాలను సూచించే ప్రయోజనాల కోసం ప్రభుత్వ విధానాలను తనిఖీ చేయడం గురించి కాదని ఉన్నత న్యాయస్థానానికి చెందిన న్యాయాధికారి తెలిపారు. రాజ్యాంగ న్యాయస్థానం ప్రభుత్వ చర్యను ఇప్పటికే ఉన్న హక్కులకు భంగం కలిగిస్తేనే సమీక్షిస్తుందని, ప్రభుత్వ చర్య సాధ్యమయ్యే హక్కు లేదా ఆశించిన విధంగా అందించనందున కాదని అన్నారు. రాజకీయ పార్టీలకు ఆ సహకారం ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను కలిగి ఉందని తెలిపారు. 'రాజకీయ చర్చకు తగిన అంశం, ప్రభావం లేని పాలనా జవాబుదారీతనం డిమాండ్ రాజ్యాంగబద్ధంగా ఉల్లంఘించే స్పష్టమైన చట్టం లేనప్పుడు కోర్టు అటువంటి విషయాలపై ప్రకటించడానికి ముందుకు సాగుతుందని కాదు' అని వెంకటరమణి అన్నారు. పార్టీలకు రాజకీయ నిధుల కోసం ఎన్నికల బాండ్ల పథకం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్లపై సుప్రీం కోర్టు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం అక్టోబరు 31 నుంచి విచారణ ప్రారంభించనుంది. జనవరి 2, 2018న ప్రభుత్వం నోటిఫై చేసిన ఈ పథకం రాజకీయ నిధులలో పారదర్శకతను తీసుకొచ్చే ప్రయత్నాల్లో భాగంగా రాజకీయ పార్టీలకు ఇచ్చే నగదు విరాళాలకు ప్రత్యామ్నాయంగా రూపొందించారు. పథకం నిబంధనల ప్రకారం, ఎన్నికల బాండ్లను భారతదేశంలోని ఎవరైనా పౌరుడు లేదా భారతదేశంలో విలీనం చేసిన లేదా స్థాపించబడిన సంస్థ కొనుగోలు చేయవచ్చు. ఒక వ్యక్తి ఒంటరిగా లేదా ఇతర వ్యక్తులతో కలిసి వీటిని కొనుగోలు చేయవచ్చు. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాకూర్, సీపీఎం దాఖలు చేసిన నాలుగు పిటిషన్లను విచారణ చేసింది. ధర్మాసనంలోని ఇతర సభ్యులు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, బి.ఆర్.గవాయ్, జె.బి.పార్దివాలా, మనోజ్ మిశ్రా. జనవరి 20, 2020న, 2018 ఎన్నికల బాండ్ల పథకంపై మధ్యంతర స్టే ఇవ్వడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. పథకంపై స్టే కోరుతూ ఎన్‌జీవో చేసిన మధ్యంతర దరఖాస్తుపై కేంద్రం, ఎన్నికల కమిషన్ ప్రతిస్పందనలను కోరింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఎ కింద నమోదయిన రాజకీయ పార్టీలు మాత్రమే ఎన్నికల బాండ్లను స్వీకరించడానికి అర్హులు. గత సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభకు లేదా రాష్ట్ర శాసనసభకు పోలైన ఓట్లలో కనీసం ఒక్క శాతం ఓట్లను పొందిన వారు ఎన్నికల బాండ్లను స్వీకరించడానికి అర్హులు.

ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలూ మావారే

ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

లక్నో: తమ పార్టీ కేవలం దళితులు, అల్పాసంఖ్యాక వర్గాల వారి కోసమే కాదని, ఇతర వెనుకబడిన వర్గాలతో సహా ఆదివాసీల కోసం కూడా పని చేస్తుందని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సోమవారం తెలిపారు. లక్నోలో తన పీడీఏ (వెనుకబడిన వర్గాలు, దళితులు, అల్పాసంఖ్యాక వర్గాలు) యాత్ర సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఆదివాసీ అయినా, వెనుకబడిన వర్గాల వారైనా, అందరూ మా పార్టీ ప్రచారం చేస్తున్న పీడీఏలో చేర్చడం జరిగింది' అని అన్నారు. 'పీడీఏ' అనేది వెనుకబడిన, దళితులు, మైనారిటీల కోసం పార్టీ రూపొందించిన పదం. సోమవారం లక్నోకు చేరుకున్న ఈ ర్యాలీ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 5 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించిందని ఆయన చెప్పారు. సామాజిక న్యాయం, హక్కులు, ప్రజల గౌరవానికి ముప్పు వాటిల్లుతుందని, కుల గణన కోసం ప్రచారం చేసేందుకు ఈ ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. 'దేశాన్ని విభజించడానికి కుట్ర పన్నుతున్న శక్తుల నుంచి రక్షించడం కోసం ఇది' అని ఆయన అన్నారు. నవంబరు 22న సైఫాయ్ (ఇటావా)లో యాత్ర ముగుస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎస్పీ అధ్యక్షుడు ఇక్కడ మాట్లాడుతూ 'దేశ పురోగతికి మార్గం ఉత్తర ప్రదేశ్ ద్వారా వస్తుందన్నారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో యూపీలో ఆరోగ్య మౌలిక సదుపాయాల స్థితిని ఆయన విమర్శించారు. 'డెంగీ వేగంగా వ్యాప్తి చెందుతోంది,.. కొన్ని గ్రామాల్లో 20 మరణాలు నమోదయ్యాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిద్రపోతోంది. ఇక్కడ ఎస్‌జీపీజీఐలో చికిత్స అందక ఎంపీ కుమారుడు చనిపోయాడు' అని ఆయన అన్నారు. ప్రభుత్వం వైద్య సేవల కోసం తగినంత డబ్బు ఖర్చు చేయడం లేదని తెలిపారు. 'బీజేపీ కేవలం కుట్రలకు పాల్పడుతుంది. మీ (మీడియా) ద్వారా వదంతులు వ్యాప్తి చేస్తుంది. ఇది చూపించడానికి కొత్తగా ఏమీ లేదు' అని అఖిలేశ్ ర్యాలీలో భాగంగా పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే నుంచి జనేశ్వర్ మిశ్రా పార్క్ వరకు తన సైకిల్ యాత్రకు ముందు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో రైలు ప్రమాదంపై ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనల గురించి అప్రమత్తం చేసే సాంకేతికతను కలిగి ఉన్నాయని ప్రభుత్వ వాదనలను బహిర్గతం చేశాయని అన్నారు. 'ఇది ఎలాంటి 'కవచ్'?' అని ప్రశ్నించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసును విజయవాడకు మార్చండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ : కావలి సమీపంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసును విజయవాడకు మార్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విజయవాడకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ రామ్ సింగ్ విధి నిర్వహణలో ఉండగా, కావలి సమీపంలో వైసీపీ గూండాలు బస్సును అడ్డగించి డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన దుర్మార్గమైనదన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిలో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడించారని, అయితే ప్రధాన నిందితుడితో సహా మరో ఇద్దరిని పట్టుకోలేక పోవటం పోలీసుల అసమర్థతకు అద్దం పడుతోందన్నారు. పైగా వారందరిపై అనేక నేరారోపణలు ఉన్నట్లు పోలీసులే చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజలను బెదిరించటం, దౌర్జన్యం, మోసం చేయటం ఈ ముఠా నైజమని, గతంలో ఈ దుండగులపై అనేక క్రిమినల్ కేసులు నమోదైనట్లు తెలుస్తోందన్నారు. ప్రధాన నిందితుడికి, పోలీసులకు మధ్య గతం నుంచి ఆర్థిక లావాదేవీలు ఉన్నట్లుగా, పోలీసులు దుండగులతో కుమ్మక్కైనట్లుగా ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అరాచక శక్తులు పెరిగిపోతున్నాయని, అడ్డూఅదుపు లేకుండా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తూ పేట్రేగిపోతున్నాయని విమర్శించారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు యంత్రాం గం కేవలం అధికార పార్టీ కనుసన్నల్లో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలపై అక్రమ కేసులు, నిర్బంధాలకే పరిమితమైందని ఆరోపించారు. డ్రైవర్ రామ్ సింగ్‌పై జరిగిన దాడి కేసును విజయవాడకు బదిలీ చేయాలని, ప్రధాన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

క్షతగాత్రులకు రూ.2 లక్షలు
కంటకాపల్లి రైలు ప్రమాద ఘటనలో 13కు చేరిన మృతులు

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లా కంటకా పల్లిలో జరిగిన రైలు ప్రమాదంలో 13మంది మృతి చెందగా... 54 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో 32మందికి విజయనగరం సర్వ జన ఆసుపత్రి లో చికిత్స నందించగా 22మందికి విశాఖ కేజీహెచ్ లో వైద్య సహాయం అందిస్తున్నారు. మృతి చెందినవారిలో విజయనగరం జిల్లా కు చెందినవారు 8మంది, శ్రీకాకుళం జిల్లా కు చెందిన ఇద్దరు విశాఖ జిల్లా కు చెందినవారు ఒకరు ఉన్నట్లు గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సిఉంది. మృతుల బంధువులకు సమాచారం అందించి పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఈ రైలు ప్రమాదంలో విశాఖపట్నం పలాస రైలు గార్డ్, విశాఖ రాయగడ లోకో పైలెట్ మృతి చెందారు. కాగా ఈ ఘటనలో క్షతగాత్రులకు రైల్వే అధికారులు 40వేల రూపాయల చెక్, రూ.పదివేల నగదు తక్షణ సహాయంగా సోమవారం ఉదయం అందించారు. ఆదివారం రాత్రి నుంచి చేపట్టిన సహాయక చర్యలు సోమవారం కూడా కొనసాగాయి. కంటకాపల్లి రైల్వే స్టేషన్ లో బోగీలను తరలించేందుకు డీఆర్ ఎం సౌరబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద స్థలాన్ని సోమవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సందర్శిస్తారనుకు న్నప్పటికీ... సహాయ చర్యలకు ఆటంకం కలుగుతుందని భావించడంతో ఆయన నేరుగా విజయనగరం సర్వజన ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాల నాయుడు సోమవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద ఘటన వివరాలు, క్షతగాత్రులకు అందుతున్న సహాయక చర్యలు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సహాయం, సమాచారం కోసం విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయిలు, క్షతగాత్రులకు 2 లక్షల రూపాయిలు, ఇతర రాష్ట్రాల మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల రూపాయిలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం జగన్ పరిహారం ప్రకటించినట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అయన వెంట శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జిల్లాలో 3వ సారి రైలు ప్రమాదం

విజయనగరం జిల్లా పరిధిలో దశాబ్దకాలంలో మూడు రైలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిలో 2017 జనవరిలో కూనేరు వద్ద హిరాఖండ్ రైలు ప్రమాదం అతి పెద్దది. ఈ ప్రమాదంలో 42మంది మృత్యువాత పడ్డారు. దీనికి ముందు 2015 నవంబర్ లో గొట్లాం వద్ద అలెప్పీ ధన్‌బాద్ బొకారో ఎక్స్‌ప్రెస్ లో మంటలు వ్యాపించాయనే భయంతో బోగీ నుంచి కిందకు దూకి పక్క ట్రాక్ పై వస్తున్న రాయగడ విజయనగరం పాసింజర్ ఢీకొనడంతో ఎనిమిది మంది చనిపోయారు. తాజాగా ఆదివారం కంటకాపల్లి ప్రమాదంలో 13మంది ప్రాణాలు కోల్పోయారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

క్షతగాత్రులకు సీఎం జగన్ పరామర్శ

విశాలాంధ్ర-విజయనగరం: రైలు ప్రమాద బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి హామీ ఇచ్చారు. వారిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పిం చారు. విజయనగరం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంటకాపల్లి రైలు ప్రమాద బాధితులను ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆసుపత్రి వార్డుల్లో 29 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతుండగా... ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ఓదార్చారు. రైలు ప్రమాదం జరిగిన తీరు, వైద్య సదుపాయంపై ఆరా తీశారు. పూర్తిగా కోలుకొనే వరకు వైద్య సహాయాన్ని అందిస్తామని తెలి పారు. మరింత మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను సీఎం జగన్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాద సంఘటనను వివరిస్తూ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ప్రమాదం జరిగిన తీరును, తీసుకున్న సహాయ చర్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ నాగలక్ష్మి, రైల్వే ఉన్నతాధికారులు సీఎంకు వివరించారు. మధ్యాహ్నం సుమారు 1.20 గంటలకు విశాఖ నుంచి హెలికాప్టర్‌లో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న సీఎం జగన్... 1.35 గంటలకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చారు. దాదాపు గంటన్నర పాటు క్షతగాత్రులను, మృతుల బంధువులను పరామ ర్శించి, వైద్య సహాయంపై సమీక్షించిన అనంతరం 3.35 గంటలకు ఆసుపత్రి నుంచి బయలు దేరి వెళ్లారు. ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, పెనుమత్స సురేష్‌బాబు, వరుదు కల్యాణి, ఎంఎల్‌ఏలు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, సీఎం అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపికా పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు లయా యాదవ్, కోలగట్ల శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసుల్లో సిసోడియాకు బెయిల్ తిరస్కృతి

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుల్లో అరెస్టైన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత మనీశ్ సిసోడియాకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో సిసోడియాకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్లను ధర్మాసనం తోసిపుచ్చింది. గతంలో సిసోడియా దాఖలు చేసిన రెండు వేర్వేరు బెయిల్ దరఖాస్తులపై అక్టోబర్ 17న తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించిన కొన్ని ఆధారాలను ఈడీ తమకు అందించినట్లు కోర్టు తెలిపింది. మద్యం కుంభకోణంలో రూ.338 కోట్ల నగదు బదిలీకి సంబంధించి ఈడీ కొన్ని ఆధారాలను చూపించినట్లు దేశ అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. ఇక ఈ లిక్కర్ స్కామ్ కేసులో విచారణను పూర్తి చేసేందుకు ఈడీకి సుప్రీంకోర్టు 6 నుంచి 8 నెలల సమయం ఇచ్చింది. విచారణ నెమ్మదిగా సాగితే మూడు నెలల్లోపు సిసోడియా మళ్లీ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హత పొందుతారని సుప్రీం పేర్కొంది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంతో సిసోడియాకు సంబంధం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఏడాదిన్నర క్రితం సీబీఐ, ఈడీ అధికారులు సిసోడియాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. లిక్కర్ స్కామ్ కేసును సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండూ విచారిస్తున్నాయి. ఈ క్రమంలో సిసోడియాను రెండు దర్యాప్తు సంస్థలకు చెందిన అధికారులూ ప్రశ్నిస్తున్నారు.

అశాంతి సృష్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలి

కేరళ పేలుళ్లపై అఖిలపక్షం తీర్మానం

తిరువనంతపురం: రాష్ట్రంలో మతపరమైన సభలో జరిగిన అనేక పేలుళ్ల ఘటనలో ముగ్గురి ప్రాణాలు బలిగొన్న నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చిన అఖిలపక్ష సమా వేశం, సమాజంలో అపనమ్మకం, అశాంతి సృష్టించే ప్రయత్నాలను ప్రతిఘటించాలని సోమవారం తీర్మానిం చింది. రాష్ట్ర సచివాలయం కాంప్లెక్స్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో పేలుళ్ల నేప థ్యంలో నిరాధార ఆరోపణలు, ఊహాజనిత ప్రచా రాలు, వదంతులు పుట్టించవద్దని ప్రజలను కోరాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ముఖ్యమంత్రి కార్యా లయం (సీఎంవో) ఒక ప్రకటనలో తెలిపింది. 19వ శతాబ్దంలో అమెరికాలో ఉద్భవించిన క్రైస్తవ మత సమూహం అయిన యెహోవా సాక్షుల ప్రార్థనా సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న కొచ్చి సమీపంలోని కలమస్సేరిలోని కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం పేలుళ్లు సంభవించాయి. రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఈ అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వం అనే ప్రత్యేక సామాజిక పరిస్థితిని తట్టుకోలేని వారు కేరళను చిన్నాభిన్నం చేసేందుకు చేసే ఒంటరి ప్రయత్నాలను ఎలాగైనా అధిగమిస్తుందని వారు తీర్మానించినట్లు ప్రకటన పేర్కొంది. సమాజంలో చీలికలు సృష్టించి ప్రజలను ఒకరికొకరు దూరం చేసేలా ఊహాగానాలు, అపోహలు, వదంతులు వ్యాప్తి చేసే ప్రయత్నాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ తుంగలో తొక్కాలని కోరారు. ఈ పేలుళ్లలో ప్రారంభంలో ఒక మహిళ మరణించగా, 52 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఆ తర్వాత, తీవ్రంగా గాయపడిన ఆరుగురిలో ఒకరు 53 ఏళ్ల మహిళ మృతి చెందింది. సోమవారం తెల్లవారు జామున ఈ ఘటనలో 95 శాతం కాలిన గాయాలతో 12 ఏళ్ల బాలిక మృతి చెందడంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. మందు పాతరలు కారణంగానే పేలుడు సంభవించిందని రాష్ట్ర పోలీసు చీఫ్ డీజీపీ షేక్ దర్వేష్ సాహెబ్ ఆదివారం ధ్రువీకరించారు. ఈ సంఘటన జరిగిన కొన్ని గంటల తర్వాత, రాష్ట్రంలోని త్రిస్సూర్ జిల్లాలో తాను యెహోవా సాక్షులమని చెప్పు కుంటున్న వ్యక్తి పోలీసుల ముందు లొంగిపోయాడు. తానే ఈ పేలుళ్లకు పాల్పడినట్లు పేర్కొన్నాడు.

కరువు రైతులను ఆదుకోండి

సీఎం జగన్ కు నారా లోకేశ్ బహిరంగ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని కోరుతూ సీఎం జగన్‌కు టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ సోమవారం లేఖ రాశారు. నీరు లేక ఎండిన పంటలు చూస్తే గుండె తరుక్కు పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో మార్గం లేక పంటల్ని రైతులు తగలబెడుతుంటే కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయని వెల్లడించారు. వరి వేసిన పొలాల్లో ఉరి వేసుకుంటున్న రైతుల్ని చూస్తే హృదయం ద్రవించిపోతోందన్నారు. నీరు వదిలి పంటల్ని కాపాడా లంటూ అధికారుల కాళ్లపై పడి ప్రాధేయపడుతున్న అన్నదాతలు, సాగు నీటి కోసం రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్న రైతులే రాష్ట్రమంతా కనిపిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆంధ్రప్రదేశ్ రైతుల్లేని రాష్ట్రం అయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లేఖ సారాంశం ఇలా ఉంది. రాష్ట్రంలో గత వందేళ్లలో ఇంతటి కరవు పరిస్థితులు ఎన్నడూ లేవు. తొలిసారి అతి తక్కువ వర్షపాతం మీ పాలనలో నమోదైంది. రైతు ఆత్మహత్యల్లో ఏపీ దేశంలోనే 3వ స్థానంలో ఉంది. అనేక మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను కేంద్రానికి నివేదించడంలో మీ ప్రభుత్వం విఫలమైంది. రైతులని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి. యుద్ధప్రాతిపదికన కరవు మండలాలని గుర్తించి కేంద్రానికి నివేదిక పంపాలి. వ్యవసాయ రుణాలు రద్దు చేయాలి. పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్ట పరిహారం తక్షణమే అందించాలని లోకేశ్ డిమాండ్ చేశారు.

చంద్రబాబు మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సోమవారం వాదనలు ముగిశాయి. అయితే తీర్పును హైకోర్టు రిజర్వ్ చేస్తూ, మంగళవారం నిర్ణయం వెల్లడిస్తామని న్యాయమూర్తి తెలిపారు. మెయిన్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు ఎప్పుడనేది మంగళవారం నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఏసీబీ కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం జైలులో చంద్రబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారని, తక్షణమే కంటికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారని ఆయన తరపు న్యాయవాదులు హైకోర్టు జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. రెండు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.

కార్మికుల కోసం పోరాటాలు చేసే
ఏఐటీయూసీ నాయకులపై తప్పుడు కేసులు సరికాదు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ : ప్రజలు, కార్మికుల కోసం శాంతియుతంగా పోరాటాలు సాగించే ఏఐటీయూసీ నాయకత్వంపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. ఏఐటీయూసీ నాయకత్వంపై 2018లో పెట్టిన కేసును సోమ వారం న్యాయ స్థానం కొట్టేసింది. ఈ సందర్భంగా న్యాయస్థానం వద్ద ఓబులేసు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై, వారికి కనీస వేతనాలు ఇవ్వాలని, చెప్పులు, కొబ్బరి నూనె, గ్లౌజులు వంటి సౌకర్యాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 2018 జులైలో చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా శాంతియుతంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఇది సహించని ఆనాటి ప్రభుత్వం 59 మందిని ముద్దాయిలుగా పెట్టి కేసు నమోదు చేసిందని అన్నారు. కేసు నంబర్ 5964/18గా తప్పుడు కేసు బనాయించారని చెప్పారు. ఇప్పటికి నాలుగున్నర సంవత్సరం విజయవాడ ఫస్ట్ ఏడీఎం కోర్టు చుట్టూ మహిళలు, వృద్ధులు కాళ్లరిగేలా తిరగడం జరిగిందన్నారు. అయితే ఈ కేసులో న్యాయమూర్తులు పూర్తి విచారణ జరిపి, ఇది తప్పుడు కేసుగా భావించి కేసును కొట్టివేసినట్లు తెలిపారు. ఈ కేసులో మహిళలు కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు వారికి సెలవులు ఇవ్వకపోయినా జీతం నష్టపోయి నాలుగేళ్లగా కోర్టు చుట్టూ తిరిగారని అన్నారు. ముఖ్యంగా మహిళలు ధైర్యంగా సంఘం కోసం కేసులకు భయపడకుండా ఎదుర్కొన్నారని వారందరినీ అభినందించారు. భవిష్యత్తులో కార్మికుల పక్షాన వారి న్యాయమైన కోర్కెల కోసం ఎంతటి పోరాటాలకైనా ఏఐటీయూసీ సంసిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కేసులో ఓబులేసుతో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు, కోట మాల్యాద్రి, బందెల రవి, వాసు ఇంకా అనేక మంది నాయకులు కార్యకర్తలు ఉన్నారు. కేసు కొట్టి వేయడంతో వారందరూ హర్షం వ్యక్తం చేశారు.

కూలీలే సమిధలయ్యారు...

రోడ్డున పడ్డ కుటుంబాలు

విశాలాంధ్ర-జామి : విజయనగరం జిల్లా కంటకాపల్లి-అలమండ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో కూలీలే సమిధలుగా మారారు. వాస్తవానికి ఈ రెండు ప్యాసింజర్ రైళ్లలో కూలీలు అధికంగా ప్రయాణిస్తారు. అతి తక్కువ చార్జీలతో ప్రయాణించి పట్టణ ప్రాంతాలలో పనులు చేసుకుని తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. ఇటువంటి కూలీ పనులకు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి రోజూ వందల మంది ఈ రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. జామి మండలంలోని గొడుకొమ్ము గ్రామానికి చెందిన కంచి బారిక రవి గ్రామంలో పనులు లేకపోవడంతో విశాఖలో పనులు చేసుకుంటూ రాత్రికి ఇంటికి చేరుకుంటాడు. ఇదేవిధంగా ఆదివారం పనికి వెళ్లాడు. కేవలం రెండు నిమిషాల్లో అలమండ స్టేషన్‌లో దిగాల్సి ఉండగా ప్రమాదం జరిగి అక్కడికక్కడే మరణించాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మరణించడంతో ఈ కుటుంబం దిక్కులేనిది అయ్యింది. ఈ ప్రమాదంలో రవితో పాటు అతని

అక్క నల్లా కుమారి సైతం ప్రయాణం చేసింది. ఆమె తీవ్రంగా గాయాల పాలై ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. అమె పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా బంధువులు చెబుతున్నారు. ఇక చీపురుపల్లిలోని కాపుశంభాంకు చెందిన కరణం లెక్కలనాయుడు తన గ్రామానికి చెందిన వారితో కొత్తవలసలో కూలి పనులకు వచ్చాడు. తిరిగి వెళుతున్న సమయంలో ప్రమాదంలో మృతి చెందాడు. లెక్కలనాయుడు మృతదేహాన్ని ఆదివారం రాత్రి చాలాసేపటి వరకు ఎవరూ గుర్తించకపోవడంతో ట్రాక్ వద్దే వదిలేశారు. వారితోపాటు వచ్చిన అనేక మంది యువకులు అతనిని గుర్తించి, వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని అక్కడనుంచి తరలించారు. ఆదివారం కావడంతో కూలి పనులకు సెలవు అని, మిగిలిన రోజులలో అయితే అధిక సంఖ్యలో కూలీలు వస్తారని, దీంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని అనేక మంది కూలీలు చెబుతున్నారు.

మహిళల సమస్యలపై పోరాటాలకు సమాయత్తం

- ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని
- రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- విజయవాడ:: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభలు నంద్యాలలో నవంబరు 17 , 18, 19 తేదీలలో నిర్వహించనున్నట్లు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని తెలిపారు. స్థానిక దాసరి భవన్‌లో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధి లక్ష్యంగా, స్వేచ్ఛ, సమానత్వం కోసం, మహిళల స్థితి గతులలో మార్పు కోసం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య గత 8 దశాబ్దాలకు పైగా పోరాడుతోందన్నారు. ఉద్యమ చరిత్ర కలిగిన సమాఖ్య ఈ మహాసభలలో కీలకమైన అంశాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నదని చెప్పారు. మహిళల సమస్యలపై పోరాటాలకు సమాయత్తం అవుతున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో 1937 సంవత్సరంలో కృష్ణా జిల్లా పామర్రులో ఏర్పాటు చేసిన నాటి నుంచి దేశ స్వాతంత్ర్యం కోసం, యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ, ప్రపంచ శాంతికి, మత సామరస్యత కోసం ఉద్యమించిందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల నాటికే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరు గమనిస్తే మరో పదేళ్లైనా అమలు చేసేటట్లు కనపించటం లేదన్నారు. ఉపాధి హామి పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని, ఈ పథకంలో పని చేస్తున్న వారందరికీ కనీసవేతనం ఉండేలా పని కల్పించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ కరువు ప్రాంతాల వారికి ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల్లో భాగంగా వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.5000, దివ్యాంగులకు రూ.6000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టం, పోక్సో, నిర్భయ చట్టాలు, సమాన ఆస్తి హక్కు చట్టం, సమాన వేతన చట్టం, సమాచార చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకంలాంటి అనేక చట్టాల రూపకల్పనకు, మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు అవసరమైన వృత్తి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయించడం, వృత్తి నైపుణ్యం వున్నవారికి వివిధ బ్యాంకులు, సంస్థలు ద్వారా రుణ సదుపాయం కల్పించడం కోసం మహిళా సమాఖ్య కృషి చేసిందన్నారు. మహిళల జీవితాల్లో మెరుగైన మార్పు తీకురావటం కోసం మహిళా సమాఖ్య కృషి చేస్తుందని దుర్గాభవానీ చెప్పారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షులు అక్కినేని వనజ మాట్లాడుతూ అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అసంఘటిత రంగంలో మహిళల ప్రాత చాలా తక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం కారణంగా ప్రమాదాలు, అనారోగ్యాలు పెరిగి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేరస్తులు తప్పించుకోవటం చాలా తేలికగా ఉందన్నారు. కరువులో వ్యవసాయ సంక్షోభం ఏర్పడి ప్రజలు వలసబాట పదుతున్నారని చెప్పారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు ఏర్పడినప్పుడు కుటుంబ బాధ్యతల్లో కీలకంగా వ్యవహరించే మహిళలపై భారం పడుతుందన్నారు. మహిళల సమస్యలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పోరా టాల్లో కూడా మహిళా సమాఖ్య పోరాటాలు చేస్తుందన్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను దుర్గాభవాని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. జయలక్ష్మి, కార్యదర్శి పి.రాణి, కోశాధికారి పంచదార్ల దుర్గాంబ, రాష్ట్ర సమితి సభ్యులు ఓర్సు భారతి పాల్గొన్నారు.

బీ ఫార్మసీ, ఫార్మ్-డీ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల

ఏపీఈఏపీ సెట్ కన్వీనర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఫార్మసీ కళాశాలల అనుమతి పొడిగింపునకు ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో రాష్ట్రంలోని బీ ఫార్మసీ, ఫార్మ్-డీ కోర్సుల ప్రవేశాల షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఏపీఈఏపీ సెట్ కన్వీనర్ చదలవాడ నాగరాణి సోమవారం విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు వేర్వేరుగా షెడ్యూల్ ఉంటుందని అన్నారు. ఎంపీసీ విద్యార్థులు నవంబరు 1 నుంచి 8వ తేదీ వరకు ఆన్ లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ఆన్ లైన్‌తో పాటు సహాయ కేంద్రాల వద్ద ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు నవంబరు 8, 9 తేదీలు కేటాయించామని వివరించారు. ఐచ్ఛికాల నమోదుకు నవంబరు 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు అవకాశం కల్పించామని, 12వ తేదీన ఐచ్ఛికాల మార్పునకు అవకాశం ఉంటుందని, 14వ తేదీ సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామన్నారు. నవంబరు 15, 16 తేదీలలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో స్వయంగా రిపోర్టు చేయాలని అన్నారు. బైపీసీ విద్యార్థులు నవంబరు 1 నుంచి 8వ తేదీ వరకు ఆన్ లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, తదుపరి ప్రకియలో మార్పులు ఉన్నాయని కన్వీనర్ తెలిపారు. ఆన్ లైన్, సహాయ కేంద్రాల వద్ద ధ్రువీకరణ పత్రాల నిర్ధారణకు నవంబరు 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు అవకాశం ఉంటుందన్నారు. నవంబరు 11 నుంచి 13 వరకు ఐచ్ఛికాలను నమోదు చేసుకునేందుకు గడువు ఇచ్చామని వివరించారు. ఐచ్ఛికాల మార్పు నకు నవంబరు 14వ తేదీ అవకాశం కల్పించగా, 17వ తేదీ సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నామని పేర్కొన్నారు. నవంబరు 18 నుంచి 21 వరకు బైపీసీ విద్యార్థులు కళాశాలల్లో స్వయంగా రిపోర్టు చేయాలని అన్నారు. షెడ్యూలు పరంగా బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఉన్న తేడాలను గుర్తించి వ్యవహరించాలని కోరారు.

ప్రజోపయోగ మేనిఫేస్టోతో ముందుకెళ్తాం

పీసీసీ సమావేశంలో గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజోప యోగమైన మంచి మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళ్తామని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నూతన కమిటీ తొలి సమావేశం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం జరిగింది. ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర బాధ్యులు క్రిష్టోఫర్ తిలక్, సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ ఎస్.రఘువీరారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, తులసిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రులు చింతా మోహన్, జేడీ శీలం, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు, సినీ హీరో రాజాతో ఈ సమావేశంలో పాల్గొని భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ, ఎంతో ముఖ్యమైన కులాల వారీ జన గణనకు అనుకూలంగా తీర్మానం చేసినట్లు వెల్లడించారు. బీసీ కులగణనతో జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న బహుజనులకు వారికి అందాల్సిన సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు న్యాయబద్ధంగా అందుతాయని తెలిపారు. ఎన్నికలకు ఒక వ్యూహంతో ముందుకు వెళ్తామన్నారు. భావసారూప్యం కలిగిన పార్టీలతో కలిసి ముందుకు వెళ్తామని, ఇప్పటికే సీపీఐ, సీపీఎం అగ్రనేతలతో భేటీ అయినట్లు తెలిపారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తోందని, సీఎం జగన్ రైతుల కష్టాలు తెలుసుకోవడానికి పర్యటనలు చేయడంతో పాటు వెంటనే కరువు జిల్లాలు, మండలాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతం దిశగా చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ఇప్పటికే కొత్త కార్యవర్గంలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా / నగర అధ్యక్షులతో ఈ మొదటి సమావేశాన్ని తెలిపారు. నవంబర్ 15వ తేదిలోపు మండల కమిటీల ఎంపిక పూర్తవుతుందని, డిసెంబర్ చివరికి బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

కాంగ్రెస్ లోకి మాజీ మంత్రి మారెప్ప

రాష్ట్ర మాజీ మంత్రి మారెప్ప కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్ లో సోమవారం జరిగిన కార్యక్రమంలో మారెప్పతో పాటు జమ్మలమడుగుకు చెందిన బ్రహ్మానందంరెడ్డికి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర బాధ్యులు క్రిష్టోఫర్ తిలక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.